
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

బుధవారం 30 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

30-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	28
నరసరావుపేట	41	28
బాపట్ల	37	28
రెంటచింతల	41	28



64 సీసీ కెమేరాలతో నిఘా

ప్రధాన నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో 64 సీసీ కెమేరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు హోం మంత్రి అనిత తెలిపారు. సీసీ టీవీ కెమేరాలతో నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సీసీ టీవీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఆరు వేల మంది పోలీసులతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీవీపీలు, ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. అమరావతి నిర్మాణం అనేది ఆంధ్ర ప్రజల కల అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధానిగా అమరావతి ఉండాలనే కాంక్షతో వైభవంగా పనులను పునః ప్రారంభించుకోవడంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, రాష్ట్ర ప్రజలు, రైతుల కష్టం, రాజధాని మహిళల ఆవేదన ఉందన్నారు. అమరావతి పునఃనిర్మాణానికి ప్రధాని రావడాన్ని రాష్ట్ర ప్రజలందరూ పండుగ వాతావరణంలో జరుపుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

రాజధాని గ్రామాల్లో ఇంటింటికీ ఆహ్వానం

పండుగలా అమరావతి రాజధాని పునఃనిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తుంది. ఈ క్రమంలో రాజధాని గ్రామాల్లోని ప్రజలను ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానం అందజేస్తోంది. ప్రధాని సభకు సకుటుంబ సపరివారంగా తరలి రావాలని ఇంటింటికీ తిరిగి ఆహ్వాన పత్రికలను అందజేసే బాధ్యతలను అధికారులు తీసుకున్నారు. ఈ మేరకు గ్రామాల వారీగా ప్రతీ ఒక్కరికి అమరావతి ఆహ్వాన పత్రికలను అందజేస్తున్నారు.



అహ్వానం పత్రం అందజేస్తున్న రైతులు

- పునఃశంకుస్థాపన మహోత్సవానికి భారీ ఏర్పాట్లు
- ప్రధాని రానుండటంతో ప్రతిష్ఠాత్మకంగా కార్యక్రమం
- మోదీకి అత్యద్భుతంగా ఆహ్వానం పలికేందుకు సన్నాహాలు
- వెలగపూడిలో ఏర్పాట్లపై పరిశీలన.. సమీక్షల్లో మంత్రులు
- బహిరంగ సభ విజయవంతానికి గ్రామ స్థాయి నుంచి ప్రణాళికలు



పార్కింగ్ ప్రదేశాలను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, కలెక్టర్ నాగలక్ష్మి, ఐజీ త్రిపాఠి, వీరపాండ్యన్, జేసీ భార్గవ తేజ



ఏర్పాట్ల గురించి కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీలు సతీష్‌కుమార్, మలికా గార్గ్‌లతో చర్చిస్తున్న హోం మంత్రి అనిత



సిద్ధమైన వేదిక

అదిరేలా.. అమరావతి సభ





వేదిక ప్రాంతంలో రోడ్డుకిరువైపులా పచ్చదనం

భారీగా ఏర్పాట్లు.. అత్యద్భుతంగా కార్యక్రమాలు.. వినూత్నంగా స్వాగత సన్నాహాలు.. మొత్తమ్మీద అదిరేలా అమరావతి పునః శంకుస్థాపన మహోత్సవం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజధాని అమరావతి పనులకు పునః శంకుస్థాపన.. ఆ తర్వాత జరిగే బహిరంగ సభ కార్యక్రమాలకు అటు మంత్రులు.. ఇటు అధికారులు ప్రత్యేకంగా బాధ్యతలు స్వీకరించారు. నిరంతరం సమీక్షలు.. ఏర్పాట్ల పరిశీలనలో నిమగ్నమయ్యారు. శుక్రవారం వెలగపూడి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మంత్రులు అనిత, నారాయణ అధికారులతో కలిసి ప్రత్యేకంగా పరిశీలించారు. దాదాపు ఏర్పాట్లు కొలిక్కి వచ్చినట్లు వారు ప్రకటించారు. ఇక గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో గ్రామ స్థాయి నుంచి అమరావతి సభకు జన సమీకరణపై అటు అధికారులు, ఇటు స్థానిక నేతలు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా సన్నాహాలు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని గ్రామాల్లో కుటుంబ సమేతంగా తరలి రావాలని అధికారులు రైతులకు అహ్వాన పత్రికలను ఇంటింటికి తిరిగి అందజేస్తున్నారు.

తుళ్లూరు(వెలగపూడి), గుంటూరు, కార్పొరేషన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యద్భుతంగా అమరావతిని తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం పునః శంకుస్థాపనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. శుక్రవారం ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, బహిరంగ సభకు వెలగపూడి సచివాలయం సమీపంలో భారీగా ఏర్పాట్లు చేసింది. పండుగ వాతావరణంలో కార్యక్రమం జరుపుకునేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆయా ఏర్పాట్లు, సభకు జనసమీకరణలపై అటు అధికారులు, ఇటు మంత్రులు ప్రత్యేకంగా బాధ్యతలు తీసుకున్నారు. మోదీ హాజరుకానుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం విజయవంతాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి సభకు హాజరయ్యే ప్రతి ఒక్కరికి తాగునీరు, మజ్జిగ, భోజనం వంటి సదుపాయాలకు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ వార్డు కి ఒక ఇన్‌చార్జిని నియమించారు. ప్రజల రవాణా కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. శుక్రవారం ఏర్పాట్లను మంత్రులు నారాయణ, వంగలపూడి అనితలు పరిశీలించారు. ఏర్పాట్లు ఒక కొలిక్కిరాగా ఇప్పటికే కేంద్ర రక్షణ బలగాలు రంగంలోకి దిగాయని మంత్రి అనిత తెలిపారు. వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, వేదిక వద్దకు చేరుకునే మార్గాలను మంత్రి నారాయణ పరిశీలించారు. బుధవారం కల్లా ఏర్పాట్లన్నీ పూర్తి అవుతాయని చెప్పారు. మంత్రుల వెంట వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఐజీ త్రిపాఠి, ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ సుప్రజ ఉన్నారు.

6

ఆకుపచ్చని ఆహ్వానం

పూలమొక్కలతో ప్రత్యేకంగా ముస్తాబు

అమరావతి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఘన స్వాగతం పలికేందుకు అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తోంది. పచ్చని మొక్కలతో రోడ్లు, హెలిప్యాడ్, వేదికకు వచ్చే మార్గాలను ముస్తాబు చేస్తోంది. సంస్థ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డీ.లక్ష్మీపార్థసారథి పలురకాల ప్రత్యేకమైన మొక్కలు తెప్పించి అమరావతిని పచ్చదనంతో నింపేశారు. వేదిక వద్దకు చేరుకునే ఎన్-9 రోడ్డు ప్రవేశ ద్వారాన్ని ఖర్జూర చెట్లతో అందంగా తీర్చి దిద్దారు. వాటి మధ్య గడిచౌడి పూల మొక్కలను నాటారు. వేదిక పాయింట్ వద్ద పచ్చిక, బొగెన్‌విల్లే, ఫ్లమేరియా మొక్కలతో అందంగా తీర్చిదిద్దారు. మందడం గ్రామం వద్ద ప్రధాన రహదారికి ఇరు వైపులా పసుపు రంగు ఆకులతో కూడిన మొక్కలను వేశారు. దీంతో ఈ రహదారిలో అవి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. సీడ్ యాక్సెస్ రోడ్డును పచ్చికతో, గులాబీ రంగు లాగర్ స్ట్రోమియా మొక్కలతో అలంకరించారు. మల్కాపురం ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ల వద్ద రోడ్డును ఇరువైపులా బొగెన్‌విల్లే కుండలతో అందంగా అలంకరించారు. సచివాలయ ప్రవేశ ద్వారాన్ని ఫికస్ పోండా, మాల్ఫిజియా కోన్లు, డ్రెస్సినియా మహాత్మా, ఖర్జూరపు చెట్లతో అందంగా అలంకరించారు.



తనిఖీ చేస్తున్న డాగ్ స్క్వాడ్‌టీం

ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

అమరావతి పునః శంకుస్థాపన కార్యక్రమానికి తరలి వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తెలిపారు. రాజధానిలో కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం ఆయన గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ హాలులో సమీక్షించారు. రాజధాని నిర్మాణ పనుల పునః ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పండుగ వాతావరణంలో అపూర్వ స్వాగతం పలికే కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి అయ్యేందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. సభకు హాజరయ్యే ప్రజలను తరలించేందుకు వాహనాలు సమకూర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు అమర్నాథ్‌రెడ్డి, రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, ఏలూరు సాంబశివరావు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర (నాని), ఏపీఎంఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్, రాష్ట్ర లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యాలరావు అమరావతిలో జరిగే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు, డిప్యూటీ మేయరు సజీలా, ఏసీ ఓబులేషు, ఏఎస్పీ రమణమూర్తి, డీటీసీ సీతారామిరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం కృష్ణకాంత్, డీఆర్డీఏ పీడీ విజయలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



అడిగినంత ఇస్తేనే బిల్లు

(తెనాలి ఆంధ్రజ్యోతి)

- లేదంటే కొర్రీల మీద కొర్రీలు
- ప్రశ్నిస్తే ఆడిట్ అని పక్కన పడేస్తారు
- ఏసీబీకి పట్టుబడినా తీరు మార్చుకోని ఉద్యోగి
- స్పెషల్ ఇంక్రిమెంట్ ఉత్తర్వుల అధికారం కలెక్టర్‌కు లేదట
- తెనాలి సబ్ ట్రెజరీలో ఓ సీనియర్ తీరుపై బాధితుల గగ్గోలు

ట్రెజరీ ఉద్యోగి: స్పెషల్ ఇంక్రిమెంటా! అయితే బాగానే వస్తుందిగా! మరి నా పరిస్థితేంటి? ఎంతిస్తావు.

ఉద్యోగి : ఎంతివ్వటమేంటండీ! అదేమీ ఊరికే రాలేదు. కష్టపడితే కలెక్టర్ స్పెషల్ ఇంక్రిమెంట్ ఆర్డర్ ఇచ్చారు. నేనేమీ ఇవ్వలేనండీ. బిల్ పాస్ చెయ్యండి. మీకు పుణ్యం ఉంటుంది.

ట్రెజరీ ఉద్యోగి : మాట్లాడితే కలెక్టర్ పేరుచెబుతావ్... కలెక్టర్ అంటే మేము భయపడిపోవాలా? అసలు కలెక్టర్‌కు ఆర్డర్ ఇచ్చే అధికారమే లేదు. అది తీసుకొచ్చి నీ నసేంటి! ఆడిట్‌కు రాస్తున్నాలే. వచ్చినప్పుడు తీసుకుందువుగాని.. వెళ్లు.

- తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఏ బిల్ కావాలన్నా, అది ముందుకు కదలాలన్నా ఆ సీనియర్ ఉద్యోగి చేతులు తడపాలనేందుకు ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటన ఓ నిదర్శనం. చేయి తడపకుంటే బిల్లుల విషయంలో కొర్రీలు వేస్తాడు.. వాటా అందితే మళ్లీ సరిచేస్తాడు.. లేదంటే అంతే సంగతులు. ఈయనతో గొడవెందుకని మరెవరితోనైనా చేయించుకుంటే ఇక ఆ ఉద్యోగి ఆయన హిట్ లిస్ట్‌లో చేరినట్లే. అంతా తిరిగి ఆయన దగ్గరకే వెళితే ఇప్పట్లో నీ పనికాదు.. నేను చెయ్యను. నువ్వు నా హిట్ లిస్ట్‌లో ఉన్నావంటూ తిప్పుకుంటూ ఉండటం ఆయన ప్రత్యేకత. బిల్లుల కోసం ఆ కార్యాలయానికి వెళ్లేవారు సాధారణ జనం కాదు. ఇతర శాఖల్లో పనిచేస్తూ బిల్లులకోసం, ఇంక్రిమెంట్ల కోసం వెళ్లేవారు తోటి ఉద్యోగులన్న కనికరం కూడా ఆయనకు లేదు. అదేమంటే.. మీరు లంచం తీసుకోకుండానే పనిచేస్తున్నారా? మేము అడిగితేనే బాధేస్తోందా! అంటూ ఎదురు మాటల దాడికి దిగడం ఆయన ప్రత్యేకత. గతంలో ఏసీబీకి పట్టుబడినా ఆ ఉద్యోగిలో ఏ మాత్రం మార్పులేదన్న విమర్శలు వస్తున్నాయి. తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయంలో గతంలో ఓ ఉద్యోగి ఇతర ఉద్యోగుల బిల్లులను తన ఖాతాకు మళ్లించుకుని జల్సాలు చేసిన ఉదంతం తెలిసిందే. ఇదే తీరులో తర్వాత వచ్చిన సిబ్బందిలో కొందరు చేతివాటం చూపిన వారూ ఉన్నారు. అయితే ప్రస్తుతం ఓ సీనియర్ ఉద్యోగి మున్సిపల్, రెవెన్యూ వంటి ఆదాయం దండిగా, బిల్లులు ఎక్కువగా ఉండే శాఖల బిల్లులే చూస్తూ వాటిని ఆదాయ మార్గాలుగా చేసుకున్నాడని ఆరోపణ. ఎంతటి వారయినా ఆ ఉద్యోగి వద్దకు బిల్ వెళ్తే ఆయన అడిగినంత ఇచ్చుకోవాల్సిందే.. లేకుంటే కొర్రి వేస్తాడు. ఓ బిల్ విషయంలో కొర్రీ వేయడంపై ఉన్నతస్థాయి అధికారి చెప్పినా పట్టించుకోలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు సంబంధించి ఓ బిల్ విషయంలోనూ 10 శాతం ఇవ్వాలని డిమాండ్ చేయగా అంత ఇవ్వలేమని తేల్చి చెప్పడంతో దానిని పాస్ చెయ్యకుండా ఆడిట్‌కు పంపుతున్నానని కొర్రీవేసి పక్కన పడేశారనేది సిబ్బంది ఆవేదన. ఓ ఉపాధ్యాయుడిని రూ.లక్ష, ఆరోగ్యశాఖ ఉద్యోగిని రూ.70 వేలు, మున్సిపాల్టీలో ఓ చిరు ఉద్యోగిని రూ.35 వేలు లంచం కింద డిమాండ్ చేశారనేది ఆరోపణ. తాజాగా ఓ వీఆర్వోకు స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వగా దానికి కూడా లంచం డిమాండ్ చేశాడంటే ఆ ఉద్యోగి తీరు అర్థం చేసుకోవచ్చు. పైగా అంత ఇవ్వలేనని ఆ వీఆర్వో చెప్పడంతో ఇష్టం వచ్చినట్లు దూషించినట్లు సమాచారం. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అండ ఉందని, తనను ఎవరూ ఏమీ చేయలేరని ఆ సీనియర్ చెలరేగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో గుంటూరు ఏసీబీ పట్టుకున్నా ఆ కేసును కొట్టివేయించుకున్నాను.. నా స్థాయి ఏమిటో తెలుసుకోండని ఉద్యోగులను బెదిరించే ధోరణిలో హెచ్చరిస్తుంటాడని సమాచారం. తెనాలి ట్రెజరీలోని ఉన్నతాధికారికి, జిల్లా ట్రెజరీ కార్యాలయంలోని మరో ఉన్నతాధికారికి కూడా వాటాలివ్వాలి, మంగళగిరి నిధి భవన్‌లో ఉన్న మరొక ఉన్నతాధికారికి కూడా సమర్పించుకోవాలని బహిరంగంగానే అతడు చెప్తూ లంచాలు పెద్దఎత్తున వసూలు చేస్తున్నాడని బాధితులు చెబుతున్నారు.

అంతగా పీడించడం మంచిది కాదు.. ఇబ్బంది పడతారని తోటి ఉద్యోగులు హితవు చెప్పే ప్రయత్నం చేస్తే వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తాడని సమాచారం. ఏసీబీలోనూ చాలా మంది పరిచయస్తులు ఉంటారని కోతలు కోస్తుం టారని తోటి ఉద్యోగులు చెబుతున్నారు. ఏటీవో స్థాయి అధికారి కూడా తమకు తెలియదన్నట్లు ఉన్నారు.



తెనాలి సబ్ ట్రెజరీ కార్యాలయం

ఆధారాలు ఉంటే చర్యలు

నేను కొత్తగా బాధ్యతలు తీసుకున్నాను. సిబ్బందిని గాడిలో పెట్టేందుకు చర్యలు మొదలుపెట్టాం. సేవల విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించం. లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆధారాలు ఉంటే ఏ స్థాయి ఉద్యోగి అయినా చర్యలు తప్పవు. తెనాలి కార్యాలయంపై ప్రత్యేక దృష్టిపెడతాం.

ఏఎంసీలకు.. రూ.139.21 కోట్ల లక్ష్యం

- గుంటూరు మిర్చియార్డుకు రూ.109 కోట్ల టార్గెట్
- గత ఏడాది రూ.117.86 కోట్లే వసూలు.. ఈ ఏడు 20 శాతం పెంపు

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. మార్కెటింగ్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ప్రతిపాదించిన లక్ష్యాలను పరిశీలించిన ఆ శాఖ డైరెక్టర్ విజయసునీత కొన్ని సవరణలు చేసి లక్ష్యాలను నిర్దేశించారు. దీంతో జిల్లాలోని ఎనిమిది ఏఎంసీలకు కలిపి ఈ ఏడాది రూ.139.21 కోట్ల లక్ష్యాన్ని కేటాయించారు. గత ఏడాది మిర్చి ధరలు పతనమై మార్కెట్ ఫీజు వసూళ్లలో ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయి. అయినా ఈ సంవత్సరం ఎప్పటిలానే 20 శాతం పెంచి ఒక్కో కమిటీకి టార్గెట్ ఇచ్చారు. గుంటూరు, తెనాలి, దుగ్గిరాల, పొన్నూరు. మంగళగిరి, తాడికొండ, ఫిరంగిపురం, ప్రత్తిపాడులో మార్కెట్ కమిటీలున్నప్పటికీ వాటి ద్వారా ఆదాయం అంతంత మాత్రమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గుంటూరు ఏఎంసీకి రూ.109 కోట్ల టార్గెట్ ఇచ్చారు. అలానే తెనాలి ఏఎంసీకి రూ.7.65 కోట్లు, దుగ్గిరాలకు రూ.3.75 కోట్లు, పొన్నూరుకు రూ.7.34 కోట్లు, మంగళగిరికి రూ.2.29 కోట్లు, తాడికొండకు రూ.1.90 కోట్లు, ఫిరంగిపురానికి రూ.1.53 కోట్లు, ప్రత్తిపాడుకు రూ.3.80 కోట్లు టార్గెట్ ఇచ్చారు. గత ఆర్థిక సంవత్సరంలో మిర్చి ధరలు పతనం కావడంతో మార్కెట్ ఫీజు వసూళ్లపై భారీగానే ప్రభావం చూపించింది. 2023-24లో గుంటూరు ఏఎంసీకి రూ.101.31 కోట్లు ఆదాయం వస్తే గత ఏడాది రూ.90.88 కోట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కాగా మార్కెటింగ్ ఆర్‌జేడీ ఈ సంవత్సరానికి రూ.146.31 కోట్ల లక్ష్యాన్ని ప్రతిపాదించగా కమిషనర్ దీనినితగ్గించి రూ.139.21 కోట్లకు పరిమితం చేశారు.

గత మూడేళ్లలో సగటు వసూళ్లు ఇలా...

2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని ఎనిమిది ఏఎంసీలకు కలిపి మార్కెట్ ఫీజు రూ.115.30 కోట్లు వసూలైంది. 2023-24లో రూ.127.70 కోట్లు, 2024025లో రూ.117.86 కోట్లు వసూలయ్యాయి. ఈ మూడేళ్లలో సగటు వసూళ్లు రూ.120.27 కోట్లుగా ఉన్నది. సాధారణంగా ఏటా మార్కెట్ ఫీజుకు 20 శాతం పెంచి లక్ష్యాన్ని నిర్దేశిస్తారు. ఆ ప్రకారం రూ.24.05 కోట్లను పెంచాలి. అలా పెంచితే రూ.144.33 కోట్లుగా టార్గెట్ ఇవ్వాల్సి ఉంటుంది. కమిషనర్ ఈ విషయంలో కొంత ఉదాశీనంగా వ్యవహరించి రూ.5 కోట్లు తగ్గించి లక్ష్యాలను ఇచ్చారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు వరకు వేచిచూడకుండా ఇప్పటి నుంచే నెలవారీ లక్ష్యాలను నిర్దేశించుకుని అధిగమించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.



హై సెక్యూరిటీ జోన్‌లోకి రాజధాని

8

- ప్రధాని మోదీ పర్యటనకు అసాధారణ భద్రతా ఏర్పాట్లు
- కేంద్ర బలగాల ఆధీనంలోకి పర్యటన ప్రాంతం
- ఇప్పటికే విధుల్లో చేరిన ఐదువేల మందికిపైగా పోలీసులు
- డ్రోన్‌లు.. సీసీ కెమెరాల ద్వారా నిఘా
- చీమ చిటుక్కుమన్నా విరుచుకుపడేలా సాయుధ బలగాలు
- పోలీసులంతా అక్కడే.. అందరి చూపు, రూటూ అటే
- నేడు ప్రధాని పర్యటన ప్రాంతంలో ట్రయల్ రన్

ఏఎన్‌యూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం 6



ఎన్జీ రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

దేశానికే రోల్ మోడల్‌గా వ్యవసాయ విశ్వవిద్యాలయం

6

- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- వైభవంగా వర్సిటీ వజ్రోత్సవాలు

స్థల సమీకరణ పూర్తికాగానే లెదర్ పార్క్

● లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

శావల్యాపురం, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో చర్మకారులు ఎక్కువగా ఉన్నందున లెదర్ పార్క్ ఏర్పాటు చే యనున్నామని రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు తెలిపారు. అనుకూలంగా స్థలం దొరకగానే పనులు ప్రారంభిస్తామన్నారు. శావల్యాపురంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విదేశీయులు వినుకొండలో లెదర్ పార్క్ ఏర్పాటు చేయడానికి ఇటీవల స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. అడిగొప్పల వద్ద కూడా స్థల పరిశీలన చేయగా... అక్కడ జగనన్న కాలనీ ఏర్పాటు చేయడంతో.. మరోచోట స్థలాన్ని పరిశీలించామన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చొరవ తీసుకొని వినుకొండలో స్థలాన్ని కేటా యిస్తే చర్మకారులకు జీవనోపాధి కల్పించేలా లెదర్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

రోడ్డెక్కిన మిర్చి రైతులు

సత్తెనపల్లి ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మిర్చి కొనుగోలు చేసిన వ్యాపారి నుండి డబ్బులను ఇప్పించాలని మిర్చి రైతులు రోడ్డెక్కారు. పురుగు మందు డబ్బాలతో సత్తెనపల్లిలోని తాలూకా సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు. ఫిరంగిపురం మండలం యర్రగుంటపాడు, సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు గ్రామాలకు చెందిన రైతుల నుంచి లక్కరాజు గార్లపాడుకు చెందిన రాయపూడి తిరుమలరావు సుమారు రూ.40 లక్షల విలువైన మిర్చిని కొనుగోలు చేశాడు. కొంతమంది రైతులకు అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించాడు. మిగిలిన మొత్తాన్ని గుంటూరు మిర్చి యార్డులో మిర్చి అమ్మి చెల్లిస్తానని నమ్మబలికాడు. తిరుమలరావు గ్రామం విడిచి వెళ్లిపోయాడని, అతనిని పట్టుకుని రూరల్ పోలీసు స్టేషన్‌లో అప్పగించినా ఇప్పటి వరకు తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులను ఇప్పించాలని కొందరు రైతులు పురుగుమందు తాగేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు. ధర్నా సందర్భంగా తాలూక సెంటర్‌లో ట్రాఫిక్ స్తంభించింది.



దేశానికే రోల్ మోడల్‌గా వ్యవసాయ విశ్వవిద్యాలయం

● వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు
● వైభవంగా వర్సిటీ వజ్రోత్సవాలు



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, రాజశేఖర్, ఏలూరి సాంబశివరావు తదితరులు

లాంఫాం(తాడికొండ)ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో దేశానికే రోల్ మోడల్‌గా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మారిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం స్థాపించి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా లాంఫాంలోని వర్సిటీలో రెండు రోజులపాటు జరగనున్న వజ్రోత్సవాలను మంగళవారం మంత్రి ప్రారంభించారు. నూతనంగా నిర్మిస్తున్న పరిపాలన భవనం వద్ద ఏర్పాటు చేసిన వర్సిటీ పైలాన్ ను, ఆచార్య ఎన్‌జీ రంగా కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి, స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. ముందుగా డ్రోన్ టెక్నా లజీని, డ్రోన్ల పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 1964లో మూడు పూటలా తిండి దొరకక ప్రాణాలు పోయే పరిస్థితిని మార్చి.. మూడు పూటలా తిండి దొరికే స్థితికి తీసుకువచ్చింది ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అన్నారు. సాగులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు జరగాలని మంత్రి ఆకాంక్షించారు. పరిపాలన భవనం పూర్తి కావడానికి.. రూ.80 కోట్లు మంజూరు చేస్తామన్నారు. వ్యవసాయశాఖ ఎక్స్ అఫిషి యో స్పెషల్ చీఫ్ సెక్రటరి బి.రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం వ్యవసాయంపై విశ్వవిద్యాలయ పుస్తకాలను, సీడీలను విడుదల చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విశ్వవిద్యాలయం అభివృద్ధికి వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు రూ.2 లక్షలు విరాళం ప్రకటించారు. వజ్రోత్సవాల్లో వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, ఏలూరి సాంబశివరావు, నా బార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు, మాజీ వీసీ డాక్టర్ టి. దామోదరనాయుడు, రైతునేస్తం ఫౌండేషన్ అధినేత వై.వెంకటేశ్వ రావు,విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకపోతే ఇంటికే..

● తాగునీటిపై సమీక్షలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో తాగునీటి సమస్యపై ఎన్నిసార్లు చెప్పినా అధికారులు తీరు మార్చుకోకపోవడం పట్ల స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల నుంచి వస్తున్న తాగునీటి ఫిర్యాదులపై స్పందించిన ఆయన మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. నీటి సమస్యపై సమీక్షించారు. ప్రజలకు సకాలంలో తాగునీరు అందించలేనప్పుడు బాధ్యులను సహించేది లేదన్నారు. ఇదే ఆఖరి హెచ్చరిక అని, తీరు మార్చుకోకుంటే బాధ్యులైన వారిని సస్పెన్షన్ తో ఇంటికి పంపడం ఖాయమని స్పష్టం చేశారు. చెరువులో పుష్కలంగా నీరున్నా, ప్రజలకు అందకపోవడం ఎవరి తప్పిదమని ఆయన ప్రశ్నించారు. సమన్వయ లోపాలుంటే పరిష్కరించు కోవాలి గానీ, ప్రజల్ని ఇబ్బంది పెడతారా అని అసహనం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగానే.. ఈ ప్రభుత్వంలో కూడా పనిచేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. తాగునీటి సమ స్య తీవ్రంగా ఉన్న పండరీపురం, మద్దినగర్, వెంగళరెడ్డినగర్, 10వ వార్డు, 38వ వార్డులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. తానే స్వయంగా వార్డుల్లోకి అకస్మాత్తుగా వెళ్లి ప్రజలు స్పందన తెలుసుకుంటానని చెప్పారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ రహీం, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులతో పాటు, కౌన్సిలర్లు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సొంతిల్లు రాష్ట్ర ప్రజల ప్రధాన సమస్య

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటికి ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇళ్లస్థలాలు వాటికి పట్టాలే నని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నరసరావుపేటలో నూతనంగా నిర్మించిన సీపీఎం జిల్లా కార్యా లయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. లక్షలాది మంది పేదలు రోడ్లు, కాల్వల పక్కన, ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని చెప్పారు. వాళ్లందరికీ పట్టాలిస్తామని లేదా పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు లెక్కన స్థలాలు ఇస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసిందని గుర్తుచేశారు. నిరాశ్రయులందరికీ ప్రభుత్వం పట్టాలు లేదా ఇళ్ల ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఉర్సాకు ఎకరా రూ.కోటి, రూ.50 లక్షలకు ఇచ్చేమనే వివరణ ఇవ్వడానికి ప్రభుత్వానికి ఇంత సమయం పట్టిందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి జి.విజయకుమార్ పాల్గొన్నారు.

పాకిస్తాన్ పౌరులు దేశం విడిచి వెళ్లాల్సిందే..

● పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ పౌరులు దేశం విడిచి తమ స్వదేశానికి వెళ్లిపోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాకిస్తానీయుల వీసాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా నివసిస్తుంటే వారిపై, వారికి ఆతిథ్యం ఇచ్చిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఏఎన్‌యూ పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

పెదకాకాని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి పీజీ నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు పరిశీలకుల నియామకంతో పాటు తనిఖీ బృందాలను నియమించారు. వర్సిటీలోని పరీక్ష కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సదుపాయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణకు గుంటూరు జిల్లాలో 14, ప్రకాశం జిల్లా పొదిలిలో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామమని తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతుందని తెలిపారు.



వర్సిటీ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న సమన్వయకర్త సుబ్బారావు

భర్తపై యాసిడ్‌తో దాడి

పెదకాకాని, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): భర్తపై భార్య యాసిడ్‌తో దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం పెదకాకాని పోలీసులు తెలిపారు. వివరాలు.. విశాఖపట్నం సమీపంలోని గాజువాక చెందిన గండికోట బాలకృష్ణ అనే వ్యక్తికి గుంటూరుకు చెందిన రమణమ్మకి రెండు నెలల క్రితం వివాహం జరిగింది. రమణమ్మకు ఇది నాలుగో వివాహం. వీరిద్దరూ గుంటూరులో నివాసం ఉంటున్నారు. గుంటూరు సమీపంలోని కుర్నూతుల గ్రామంలో బాలకృష్ణ సోదరి ఇంటిలో శుభకార్యానికి వెళ్లవద్దని భార్య రమణమ్మ భర్తకు అడ్డుపడింది. దీంతో వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గత రాత్రి తన స్నేహితుడిని కలిసేందుకు బాలకృష్ణ ద్విచక్ర వాహనంపై కాజ గ్రామానికి వెళ్తున్నాడు. భార్య రమణమ్మ మరో వ్యక్తి సహకారంతో కార్‌లో పెదకాకాని సమీపంలోని జాతీయ రహదారిపై పల్లాలమ్మ చెరువు వద్ద బాలకృష్ణను అడ్డగించింది. తనతో పాటు తెచ్చిన యాసిడ్‌ను అతనిపై పోసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. స్థానికుల సహకారంతో 108 అంబులెన్స్‌లో బాధితుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

జాతీయస్థాయి ఎడ్ల పందేలకు క్వారీ సిద్ధం

● ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల



లాగుడు బండలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరుటౌన్(చేబ్రోలు), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ధూళిపాళ్ల వీరయ్య చౌదరి మెమోరియల్ జాతీయస్థాయి ఒంగోలు జాతి వృషభ రాజాల బల ప్రదర్శనకు వడ్లమూడి బాలకోటేశ్వరస్వామి క్వారీ ప్రాంగణం సిద్ధం అవుతుంది. గురువారం నుంచి మే 8వ తేదీ వరకు ఎడ్ల పందేల నిర్వహణకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. మొదటి రోజు టచ్ పళ్లు, 2న రెండు పళ్లు, 3న నాలుగు పళ్లు, 4న ఆరు పళ్లు, 5న న్యూ కేటగిరి, 6న సబ్ జూనియర్స్, 7న జూనియర్స్, 8న సీనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయి. జూనియర్స్ విభాగంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ మొదటి బహుమతిగా ప్రకటించారు. ప్రతి విభాగంలో నగదు బహుమతులు, రూ.3 వేల నుంచి రూ.15 వేల వరకు కన్సోలేషన్ బహుమతులు ప్రదానం చేయ నున్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకు డ్రా నిర్వహిస్తారు. పొన్నూరు నియోజకవర్గంలోనే తొలిసారిగా జాతీయస్థాయి ఒంగోలు జాతి బండ లాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. ఒంగోలు జాతి పశుపోషకులను ప్రోత్సహించేందుకు లక్ష్యంగా ఈ పోటీలులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే పదుల సంఖ్యలో ఎకరాలను చదును చేశారు. ప్రేక్షకులు వీక్షించేలా గ్యాలరీలు ఏర్పాట్లు జరిగాయి. వేసవి దృష్ట్యా ఎడ్ల పోటీలను సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల వరకు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

ఎడ్ల బల ప్రదర్శన ప్రాంగణాన్ని మంగళవారం ఎమ్మెల్యే, సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పరిశీలించారు. బాలకోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్త బండలకు పూజలు చేశారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.

వైద్య కళాశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో నిర్మించిన ప్రవేశద్వారంతో పాటు అభివృద్ధి చేసిన అవుటర్ వాల్‌ను దాత న్యూరాలజిస్ట్ డాక్టర్ చెరుకూరి పవన్‌కుమార్ మంగళవారం శిలాఫలకం ఆవిష్కరించి, ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ పిలుపు మేరకు ఆయన ఈ అభివృద్ధి పనులకు రూ.8 లక్షలు విరాళమిచ్చారు. వాల్‌కు పెయింటింగ్ వేసి, జీఎంసీ గోల్డెన్స్ లెటర్స్ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ సుందరాచారి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, వివిధ వైద్య విభాగాధిపతులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో రోటరీ క్లబ్ సెంటినియల్ ఆధ్వర్యంలో రూ.75 వేలతో ఏర్పాటు చేసిన 'వీ ట్రస్ట్ జీజీహెచ్' అనే గ్లో సైన్‌బోర్డ్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ ప్రారంభించారు. రోటరీ క్లబ్ గుంటూరు అధ్యక్షుడు పొనకాల బాల సుబ్రహ్మణ్యం, కార్యదర్శి నవీన్ చక్రవర్తి, క్లబ్ డైరెక్టర్లు డాక్టర్ వీర రాఘవ, సంతోష్, కోట మురళీకృష్ణ పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ చెరుకూరి పవన్ కుమార్

ప్రధాని పర్యటనతో ఏపీ అభివృద్ధిలో నవశకం

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనతో అమరావతి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో నవశకం ప్రారంభం కాబోతుందని ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావుతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలోనే అమరావతి శంకుస్థాపన చేసి, రాష్ట్ర అభివృద్ధికి మోదీ చేయూత ఇచ్చారని గుర్తుచేశారు. జగన్ హయాంలోనే అవన్నీ ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ అభివృద్ధి యజ్ఞంలా ప్రారంభించేందుకు మే 2న ప్రధాని మోదీ అమరావతికి రానున్నారని చెప్పారు. మోదీ సభ విజయవంతం చేయడానికి జన సమీకరణలో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు నియోజకవర్గ వ్యాప్తంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, 5 వేల మందికి పైగా ఈ సభకు వచ్చేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా నుంచి 50 వేల మంది సభకు వస్తారని అంచనా అని పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు డీసీసీబీ చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావుకు అవకాశం ఇచ్చినందుకు సీఎంకు ఎమ్మెల్యే జీవీ ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

చిన్న సినిమాలకు ఆదరణ కరువు : సినీనటి శివపార్వతి



భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న సినిమాలకు ఆదరణ కరువైందని తెలుగు సినీ నటి, క్యారెక్టర్ ఆర్టిస్టు పొలిశెట్టి శివపార్వతి పేర్కొన్నారు. మండల పరిధిలోని పల్లెకోనలో జరుగుతున్న పరుచూరి రఘుబాబు 35వ స్మారక జాతీయ నాటకోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, నాటక రంగం గతంలో లాగ ఆదరణ నోచుకోలేకపోతుందన్నారు. తాను కూడా రంగ స్థలం నుండి తెలుగు చిత్ర పరిశ్రమకు ఎదిగినట్లు చెప్పారు. తెనాలిలో పుట్టి పెరిగిన తాను 1975 నుండి రంగస్థల కళాకారిణిగా అనేక నాటక ప్రదర్శనలు ఇచ్చినట్లు తెలిపారు. 1993లో పరుచూరి బ్రదర్స్ ఆశీస్సులతో సురేష్ ప్రొడక్షన్ అధినేత స్వర్గీయ రామానాయుడు, శోభన్‌బాబు హీరోగా నటించిన సర్పయాగం సినిమాతో తన సినీ రంగ ప్రవేశం జరిగిందన్నారు. అప్పటి నుండి సీనియర్ నటులు ఎన్టీఆర్, నాగేశ్వరరావు, శోభన్‌బాబు, కృష్ణ, కృష్ణంరాజు, చిరంజీవి, బాలకృష్ణ అగ్రహీరోల సినిమాలతో పాటు ఇప్పటివరకు 280 సినిమాల్లో నటించినట్లు పేర్కొన్నారు. పరుచూరి సోదరులు నాటక రంగ కళాకారులను ప్రోత్సహించడం కళాకారులకు వరం లాంటిదన్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై ఫిర్యాదు

రొంపిచర్ల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే అరవిందబాబుతో పాటు తనపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై తెలుగు యువత నాయకుడు వడ్లమూడి వెంకట కిషోర్ మంగళవారం రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మణికృష్ణకు ఫిర్యాదును అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జగ్గయ్య మాట్లాడుతూ అభివృద్ధికి మారుపేరుగా ఉన్న నరసరావుపేటలో ఈ విధంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడటం తగదని హితవు పలికారు. వడ్లమూడి వెంకట కిషోర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ విగ్రహం, టీడీపీ జెండా ఏర్పాటు చేయడం మాజీ ఎమ్మెల్యే జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గాడిపర్తి సురేష్, పల్లెల నాగిరెడ్డి, లింగా వెంకటేశ్వర్లు, మొండితోక రామారావు, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ మణికృష్ణకు ఫిర్యాదు అందజేస్తున్న వడ్లమూడి వెంకట కిషోర్, టీడీపీ నాయకులు

హత్య కేసులో జీవిత ఖైదు, జరిమానా

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని దారుణంగా హతమార్చి, రూ.380లు నగదు దోపిడీ చేసినట్లు నేరం రుజువుకావడంతో.. పట్టణానికి చెందిన తన్నీరు అంకమ్మరావు అలియాస్ ముళ్లపందికి జీవిత ఖైదు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి నేతి సత్యశ్రీ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2023 మే 9వ తేదీన రాత్రి పట్టణంలోని బ్రహ్మానంద రెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్‌లో నిద్రిస్తున్న 55 ఏళ్లున్న గుర్తుతెలియని వ్యక్తిని నిందితుడు ఇటుక రాయితో మోది, దారుణంగా హత్యచేశాడు. అతని నుండి కొంత నగదు దొంగిలించాడు. మరుసటి రోజు 18వ వార్డు ఇన్‌చార్జి వీర్వో చల్లా చిరంజీవి ఈ ఘటనపై మొదటి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ ఆకుల అశోక్ కుమార్ నిందితుడిని అరెస్టు చేసి, ప్రాథమిక దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో.. హత్య కేసులో జీవిత ఖైదు, జరిమానా, దోపిడీ కేసులో పదేళ్ల కఠిన కారాకార శిక్ష, రూ.5 కవేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి నిర్వహించారు. నిందితుడు అంకమ్మరావు పలు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

1,24,819 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,27,525 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,24,819 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,500 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నంబరు.5	10000	12500
273	10000	12400
341	10000	13200
4884	10000	11200
సూపర్10	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తేజ	10000	13600
షార్క్-1	10000	12100
బ్యాడిగి 355	10000	13000
సింజెంటా బ్యాడిగి 5531	---	---
దేవనూరుడీలక్స్	10000	12600
ఆర్మూరు	9800	11200
తాలుకాయలు	4500	6500

జిల్లాలో కొత్తగా 3,560 మందికి పింఛన్లు

- స్పౌజ్ కోటాలో లబ్ధిదారుల ఎంపిక
- ఐదు రోజుల్లో ముగిసిన ప్రక్రియ

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 3,560 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. స్పౌజ్ కోటా కింద వీరికి అర్హత లభించింది. ఈనెల 25వ తేదీన స్పౌజ్ కోటా కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించిన జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఐదురోజుల్లో మొత్తం ప్రక్రియను పూర్తిచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పౌజ్ కోటా పింఛన్లకు అవకాశం కల్పించింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టలేదు. దీంతో అనేక మంది పింఛనుకు దూరమయ్యారు. వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ప్రభుత్వం దిద్దుబాటు చేపట్టింది. ఈ క్రమంలో 2024 అక్టోబరు తరువాత చనిపోయినవారందరికీ వెంటనే స్పౌజ్ కోటా పింఛన్లు మంజూరు చేశారు. ఆ ప్రక్రియకు కొనసాగింపుగా 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య చనిపోయినవారి కుటుంబీకులకు స్పౌజ్ కోటా పింఛన్లను ప్రభుత్వం వర్తింపజేసింది. ఈ కోటాలో మూడు జిల్లాల్లో 10 వేల మంది వరకూ అర్హులు ఉన్నారని అధికారులు గుర్తించారు. కాగా గుంటూరు జిల్లాలో తాజాగా 3,560 మంది అర్హులు స్పౌజ్ కోటా పింఛన్లకు అర్హత సాధించారు. వారికి వచ్చేనెల నుంచే పింఛన్లు అందజేస్తామని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి తెలిపారు.

నేడు పాలిసెట్ ప్రవేశ పరీక్ష

- గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి :కోఆర్డినేటర్

గుంటూరు (విద్య) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం బుధవారం పాలీసెట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం గుంటూరు నగరంలో మొత్తం 11 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించనున్నారు. విద్యార్థినీ, విద్యార్థులు నిర్దేశించిన సమయం కంటే కనీసం గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కో ఆర్డినేటర్ సూచించారు. నగరంలోని గుజ్జనగుండ్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు, టీజేపీఎస్ పీజీ కళాశాల, డిగ్రీ కళాశాలలో రెండు కేంద్రాలు, మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాల, ఏసీ కళాశాల, బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ జూనియర్, డిగ్రీ కళాశాలలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల, పలకలూరులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, చంద్రమౌళినగర్ 3/1 లోని భాష్యం హైస్కూల్ తదితర ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 4030 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరుకానున్నట్లు నల్లపాడులోని ఎంటీటీసీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ శేఖర్ బాబు తెలిపారు. విద్యార్థుల హాల్ టికెట్లు ఇప్పటికే పాలీసెట్ వెబ్‌సైట్లో ఉన్నాయని, వాటి నుంచి డౌన్లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావచ్చునని వెల్లడించారు.



మేయర్ నానికి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేస్తున్న కేసన, క్రాంతికుమార్ తదితరులు

మేయర్ నానికి ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతల అభినందనలు

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ మేయర్‌గా ఎన్నికైన కోవెలమూడి రవీంద్ర (నాని)కి ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్, ఇతర నాయకులు అభినందనలు తెలిపారు. మేయర్ కార్యాలయంలో మంగళవారం ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నగరాభివృద్ధికి మరింత కృషి చేయాలని, తమ సహాయ సహకారాలు ఉంటాయని కేసన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అడకా శ్రీనివాసరావు, సంఘం నాయకులు మల్లేశ్వరరావు, కొల్లూరి హనుమంతరావు, ఉప్పుటూరు పేరయ్య, కోటేశ్వరరావు తదితరులున్నారు.



నగర మేయర్ రవీంద్రకి సన్మానం

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు మేయర్‌గా ఎన్నికైన కోవెలమూడి రవీంద్ర(నాని)ని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ దాసరి రాజామాస్టారు, దామచర్ల శ్రీనివాసరావు, మేళం సైదయ్యలు సన్మానించారు.

నిమ్మల, పులివర్తిని సన్మానించిన శ్రావణ్‌కుమార్

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు పరిశీలకులుగా నియమితులైన రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ శాలువాతో సత్కరించారు. సభ ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం జిల్లాకు వచ్చిన వారిరువురు అరండల్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ వారిని సన్మానించారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, దామచర్ల శ్రీనివాసరావు, నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిమ్మల రామానాయుడు, పులివర్తి నానీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్తు

- డీఐ ఎండీ ఖాసిం

గుంటూరు (విద్య), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : ఉర్దూ భాషతో ఉజ్వల భవిష్యత్తు ఉందని గుంటూరు ఉర్దూ డీఐ, ఎండీ ఖాసిం అన్నారు. ఉర్దూ భాష అభివృద్ధిలో భాగంగా ఉర్దూ అకాడమీ గుంటూరు ఉర్దూ భాష ప్రాముఖ్యతపై విడుదల చేసిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్దూ భాషతో భారతదేశానికి విడదీయరాని అనుబంధం ఉందని, ఉర్దూ భాష ముస్లింల భాష కాదని, భారతీయుల భాష అని, దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ కార్యాలయ సిబ్బంది షేక్ అక్బర్, ఫక్రుద్దీన్ అలీ, నయామ్, రఫీ, అబ్దుల్లా ఖాన్, మెహబూదున్నీసా, మల్లికా సుల్తానా మరియు నాగూర్ భాష తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి : జంగాల

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్, తెలంగాణ బోర్డర్‌లో చేపట్టిన కగార్ ఆపరేషన్ పేరుతో భారత పౌరులను చంపుతున్నామనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలని, తక్షణమే మావోయిస్టులతో చర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ సూచించారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాము చర్చలకు సిద్ధమంటూ అనేకమార్లు మావోయిస్టులు ప్రకటించినప్పటికి వారి అభ్యర్థనను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సమంజసం కాదని అన్నారు. మే 1వ తేదీన 139వ మే డే వేడుకలను జిల్లా వ్యాప్తంగా వాడవాడల ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు, మంగా శ్రీనివాసరావు, రాంప్రసాదు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనలో అధికారులు బాధ్యతగా ఉండాలి

- కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు



కలెక్టరేట్‌లో ప్రధాని పర్యటనపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయం సమీపంలో మే 2వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించే కార్యక్రమంలో పాల్గొననున్నందున విధులు కేటాయించిన అధికారులందరు పటిష్ఠ ప్రణాళికతో బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో ప్రధాని పర్యటనకు సంబంధించి విధులు కేటాయించిన అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలితో కలసి మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించే కార్యక్రమానికి ప్రధానితో పాటు సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులు హాజరవుతున్నందున హెలిప్యాడ్ వద్ద, ప్రధానమంత్రి ప్రయాణించే మార్గాల్లో, వేదిక సమీపంలో, గ్యాలరీలలో విధులు కేటాయించిన అధికారులు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం డ్యూటీలు నిర్వహించాలన్నారు. హెలిప్యాడ్ వద్ద, ప్రధాని ప్రయాణించే మార్గాల్లో రోడ్డు షోకు అనుగుణంగా ఆర్ అండ్ బీ అధికారులు పటిష్ఠంగా బ్యారికేడ్‌లు ఏర్పాటు చేయాలని, ఎంపీఐపీలు ప్రయాణించే మార్గాల్లో విద్యుత్ వైర్లు లేకుండా విద్యుచ్ఛక్తి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కానున్న నేపథ్యంలో గ్యాలరీలకు ఇన్‌ఛార్జ్‌లుగా నియమించిన అధికారులు తాగునీటి సరఫరా, వైద్య, శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉంచుకునేలా ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సభకు బస్సుల్లో తరలిరానున్న ప్రజలకు మధ్యాహ్న సమయంలో నిర్దేశిత ట్రాన్సిట్ పాయింట్ వద్ద లంచ్ ప్యాకెట్లు, సాయంత్రం సభ ముగిసిన తరువాత పార్కింగ్ ప్రాంతాల్లో డిన్నర్ ప్యాకెట్లు అందించేలా రవాణ, ఆర్టీసీ, మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా సభ ముగిసిన అనంతరం సురక్షితంగా ఇళ్లకు వెళ్ళేలా అధికారులందరూ సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విధులు కేటాయించిన రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, విద్యుత్, రవాణ, అగ్నిమాపక, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నడికుడి రైలుమార్గంలో కీలకమైన ఇంజనీరింగ్ వర్కులు పూర్తి

- బ్లాక్ విచ్ఛిన్నం లేకుండా సమర్థంగా నిర్వహణ

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పగిడిపల్లి మార్గంలో రైల్వే ఇంజనీరింగ్ విభాగం రోలింగ్ బ్లాక్ ప్రోగ్రాం(ఆర్‌బీపీ) కింద పలు చోట్ల ఇంజనీరింగ్ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేసింది. మంగళవారం ఆర్‌బీపీ కింద మేజర్ బ్లాక్‌లను ప్లానింగ్ చేసింది. ఎక్కడా బ్లాక్‌లు విచ్ఛిన్నం కాకుండా సమర్థంగా పనులు పూర్తి చేయడంపై డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్ణ సేన్ ఇంజనీరింగ్ అధికారులను ప్రత్యేకించి అభినందించారు. సత్తెనపల్లి - రెడ్డిగూడెం స్టేషన్ల మధ్యన వాగు మీద ఉన్న రైలు వంతెనపై గతంలో స్టీల్ గర్డర్లు ఉండేవి. వాటిని తొలగించి పీఎస్‌సీ శ్లాబుల ద్వారా విజయవంతంగా అమర్చారు. రామన్నపేట - చిట్యాల మధ్యన లెవల్ క్రాసింగ్ గేటు నంబరు 23 వద్ద ఒక వెంట్‌లో నీరు నిలిచిపోతుంది. దీని వల్ల సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉండడంతో మరో వెంట్‌ని ఏర్పాటు చేశారు. తుమ్మలచెరువు - నడికుడి మధ్యన రైలు మార్గం సరిగా లేకపోవడంతో మెషీన్ ట్యాంపింగ్ చేసి సరిచేశారు. అలానే సత్తెనపల్లి యార్డులో మెయిన్‌లైన్, లూప్‌లైన్ ట్యాంపింగ్ కూడా విజయవంతంగా పూర్తి చేశారు. నాగిరెడ్డిపల్లి - వలిగొండ, రామన్నపేట యార్డు వద్ద షోల్డర్ జాయింట్ స్క్రీనింగ్ వర్కులు చేపట్టి పూర్తిచేశారు. అలానే కొండ్రపోలు హాల్ట్ వద్ద రైల్ జాయింట్స్ వెల్డింగ్ పనులను కూడా చేశారు. దీంతో గుంటూరు - పగిడిపల్లి మార్గంలో రైళ్ల రాకపోకలకు మరింత భద్రత సమకూరుతుందని ఇంజనీరింగ్ వర్గాలు తెలిపాయి.



సత్తెనపల్లి - రెడ్డిగూడెం సెక్షన్‌లో స్టీల్ గర్డర్స్ తొలగించి పీఎస్‌సీ శ్లాబులు అమరుస్తున్న రైల్వే ఇంజనీరింగ్ విభాగం

బ్లాక్ గురించి ఎలాంటి సమాచారం ఇవ్వని రైల్వే శాఖ

రోలింగ్ బ్లాక్ ప్రోగ్రాం అయినప్పటికీ రైల్వే శాఖ ఎక్కడా ఈ సమాచారాన్ని ఇవ్వలేదు. ఈ కారణంగా రేపల్లె-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరిన ప్రయాణికులు నడికుడిలో దాదాపుగా 48 నిమిషాల పాటు ఎండలో రైలుని నిలిపేయడంతో ఇబ్బందులు పడ్డారు. అలానే సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్‌ని 50 నిమిషాల ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు. కాచీగూడ - నడికుడి రైలుని రద్దు చేశారు. ఈ వివరాలు ముందుగానే రైల్వే శాఖ విడుదల చేయకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

పోస్టింగ్ ఇవ్వకుండా అధికారికి వేధింపులు

- మార్చి 14 నుంచి ఎదురు చూపులు
- ఆరోగ్య శాఖ ఆర్డీ కార్యాలయంలో అంతులేని నిర్లక్ష్యం

గుంటూరు సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులోని వైద్య, ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) కార్యాలయం మరో వివాదంలో చిక్కుకుంది. ఉన్నత స్థాయి అధికారులకు కూడా తగిన కాలంలో పోస్టింగ్‌లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా డిప్యూటీ స్టాటిస్టికల్ అధికారి రమేష్‌బాబుకు పోస్టింగ్ ఇవ్వకపోవటం చర్చనీయాంశంగా మారింది. ఒంగోలులో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న ఆయనను ఐదేళ్లు దాటడంతో రిలీవ్ చేసి ఆర్డీ కార్యాలయానికి పంపారు. అక్కడ రిలీవ్ అయిన రమేష్ బాబు గుంటూరు ఆర్డీ కార్యాలయంలో మార్చి 14వ తేదీన జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. వెంటనే ఆయనకు పోస్టింగ్ ఇచ్చి పని చేయించాల్సిన బాధ్యత ఆర్డీ కార్యాలయం అధికారులపై ఉంది. కానీ నెలకు పైబడి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం వివాదాన్ని రేపుతోంది. ఉన్నత స్థాయి అధికారికి పోస్టింగ్ ఇవ్వకుండా ఇన్ని రోజులు ఎదురు చూసేలా చేయటం గతంలో ఎన్నడూ జరగలేదని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధమైంది.

మెడికల్ అడ్మిషన్లు పారదర్శకంగా నిర్వహించాలి

- ఎన్టీఆర్ వర్సిటీ వీసీకి ఏపీ ఎంపీఏ నాయకుల విజ్ఞప్తి



ఎన్టీఆర్ వర్సిటీ వీసీని సత్కరిస్తున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తదితరులు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ నూతన వైస్ ఛాన్సలర్‌గా నియమించబడిన డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను మంగళవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వయిజర్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది వై.ఠాగూర్ యాదవ్‌లు యూనివర్సిటీలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మెడికల్ అడ్మిషన్స్ మరింత పారదర్శకంగా, అభ్యర్థులు వారి తల్లిదండ్రులు ఆందోళనకు గురికాకుండా ఉండే విధంగా నిర్వహించాలని కోరారు. వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ మెడికల్ అడ్మిషన్స్‌లో అభ్యర్థుల శ్రేయస్సుకు ఎటువంటి నష్టం కలగకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్మిక హక్కులను నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎనిమిది గంటల పని దినం కోసం జరిగిన పోరాటంలో మృతి చెందిన అమరవీరుల సాక్షిగా సాధించుకున్న కార్మిక హక్కులను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ హమాలీ(ముఠా)ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న అంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఏటుకూరు రోడ్డు, రేగుల రాఘవయ్య భవనంలో జరిగిన నగర ముఠా కార్మిక సంఘం కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే ఈ 139వ మేడేను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సంఘ నగర అధ్యక్షుడు జి.సురేష్ బాబు మాట్లాడుతూ మే డే రోజున రేగుల రాఘవయ్య భవనం నుంచి కార్మిక ప్రదర్శన ప్రారంభం అవుతుందని, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావుల అంజిబాబు, పోనుగోటి వెంకటరెడ్డి, పప్పుల రోసిరెడ్డి, ఉప్పలపాటి శ్రీను, లక్ష్మయ్య, లింగిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా మంగళవారం టీజేపీఎస్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, కార్యదర్శి కేవీ బ్రహ్మం, పీజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపల్ భాను మురళీధర్, జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఎన్‌సీసీ అధికారి మేజర్ పి.కుమార్ రాజా విద్యార్థులు పాల్గొన్నారు.

అసమాన త్యాగశీలి వావిలాల

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన అసమాన త్యాగశీలి వావిలాల గోపాలకృష్ణయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, పద్మభూషణ్ అవార్డు గ్రహీత వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి మంగళవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ వావిలాల తన చివరి క్షణం వరకు తెలుగు వారి కోసం, తెలుగు భాష అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన యోధుడన్నారు. విద్యావేత్త ఆర్‌వీ సింగరయ్య, చంద్రయ్య, జమదగ్ని, ఘనశ్యామాచార్యులు తదితరులున్నారు.

రైల్వే స్టేషన్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేషన్‌లో పోలీసులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రదాని పర్యటన నేపథ్యంలో గుంటూరు రైల్వే సీఐ జి.అంజిబాబు, ఆర్‌పీ ఎస్సై లక్ష్మీనారాయణరెడ్డి, మహిళా ఆర్ఎస్సై యు.జ్యోతి, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీరబాబు, సిబ్బంది డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సాయంత్రం ప్లాట్‌ఫామ్స్, వెయిటింగ్ హాల్స్, బుకింగ్ ఆఫీసులు, రిజర్వేషన్ కౌంటర్లు, రైల్వే కోచ్ పార్సెల్ ఆఫీసులలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు.

వృద్ధురాలి మృతిపై కేసు నమోదు



సఖీనాబీ మృతదేహం

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): చుట్టుగుంట సమీపంలోని లక్ష్మీనారాయణపురంలో షేక్ సఖీనాబీ (80) అనే వృద్ధురాలు అనుమా నాస్పద స్థితిలో మృతిచెందారు. నగరంపాలెం పోలీసుల కథనం మేరకు.. షేక్ మస్తాన్, సఖీనాబీ దంపతులకు సంతానం లేదు. దీంతో మస్తాన్ అస్మ త్ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో ఫిరంగిపురానికి చెందిన సఖినాబీ పుట్టింటికి వెళ్లిపోయింది. మస్తాన్, అస్మత్ దంపతులకు ఆరుగురు సంతానం. 25 ఏళ్ల క్రితం అస్మత్ మృతి చెందడంతో.. మస్తాన్, తన మొదటి భార్య సఖీనాబీని ఇంటికి తెచ్చుకున్నారు. 11 ఏళ్ల క్రితం మస్తాన్ కూడా కన్నుమూశారు. అప్పటి నుంచి మస్తాన్ రెండో భార్య పిల్లలతో సఖీనాబీ కలిసి ఉంటుంది. పై పోర్షన్‌లో కుమారుడితో సకినాబీ ఉంటుండగా, పక్క పోర్షన్‌లో మరో కుమారుడు ఉంటున్నాడు. మంగళ వారం ఉదయం ఇంట్లో మెట్లపై సఖీనాబీ జారిపడి మృతి చెందిందని కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. అయితే ఫిరంగి పురంలోని సఖీనాబీ బంధువులు ఈ కార్యక్రమానికి వచ్చి ఆమె తలపైన రక్తగాయాలు ఉండడంతో అనుమానించి.. నగరంపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కణితితోపాటు తలపైన ఒంటిపైన గాయాలు ఉన్నాయని ఇది హత్య అంటూ అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చైతన్యపురికి చెందిన డాక్టర్ అదృశ్యం

స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్యపురి కాలనీకి చెందిన ఫణిదం సౌదామిని(25) అనే యువతి మంగళవారం అదృశ్యమైంది. ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇంటిలో ఉంటోంది. మంగళవారం మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్ళి తిరిగి రాలేదు. ఆమె తల్లి ఫణిదం కృష్ణ కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు యూనివర్సిటీల్లో విద్యార్థులు మృతి చెందుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. బ్రాడీపేట ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రి స్పందించి ప్రైవేటు యూనివర్సిటీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సమీర్ నగర కార్యదర్శి ఏ యశ్వంత్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన మహా మంజీర నాదం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, అన్నమయ్య కళావేదికపై వారం రోజుల పాటు జరిగిన మహా మంజీర నాదం మంగళవారంతో వైభవంగా ముగిసాయి. అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకొని నటరాజ పూజ, అనంతరం నటరాజ స్వామి వందన రఘు నందన అనే త్యాగరాజ కీర్తనకు 200 మంది కళాకారులు నృత్యర్చన చేశారు. సాయంత్రం జరిగిన సభను ఆలయ అధ్యక్షుడు మస్తానయ్య ప్రారంభించగా, సభకు భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జరిగిన నృత్య కార్యక్రమంలో రాజమోహన్(కేరళ) మోహిని అట్టం, అవిజిత్ కుందు(బెంగళూరు) భరతనాట్యంను ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపజేశారు. కళారత్న పురస్కారాన్ని అందుకున్నందుకు డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యంకు పసుమర్తి కృష్ణమూర్తి స్మారక జీవిత సాఫల్య శత గురు జయంతి పురస్కారాన్ని ఆయన శిష్యులు, ప్రముఖులు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

వైభవంగా అమ్మవారి వార్షిక మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి) : స్థానిక శారదా కాలనీ, 27వ లైన్లో కొలువైన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి 31వ వార్షిక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ, గణపతిపూజ తదితర సేవలు జరిగాయి. అనంతరం లలితాదేవి సహస్ర నామాలతో అమ్మవారికి లక్ష కనకాంబరాలతో పూజ, శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం త్రినాధ భజన మండలి కోట తిరుపతమ్మ వారిచే కోలాటం ఆకట్టుకుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి, చిత్రంలో మేయర్ నాని, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల

ప్రధాని మోదీ సభను విజయవంతం చేయాలి

- అంకితభావంతో పని చేసిన ప్రతి ఒక్కరికీ పదవులు
- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న జరగనున్న రాజధాని పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి వస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను విజయవంతం చేద్దామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. టీడీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో ఆమె అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణ, ప్రధాని అమరావతి పర్యటనకి జనసమీకరణ గురించి చర్చించారు. టీడీపీలో కష్టపడిన నేతలకు న్యాయం చేసేలా కోవెలమూడి రవీంద్రకు మేయర్ పదవి కేటాయించిన ముఖ్యమంత్రికి, డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపే తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని గడిచిన ఐదేళ్లలో వైసీపీ చంపేసిందని, జగన్‌రెడ్డి రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను చేసి, ప్రపంచం ముందు నవ్వుల పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాసంకల్పంతో చంద్రబాబు అధికారంలోకి వచ్చి తిరిగి అమరావతిని నిర్మించటానికి సంకల్పించారని, ఆ క్రమంలోనే మే 2న రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ వస్తున్నారని, గుంటూరు నుంచి వేలాది మందితో సభకు వెళ్దామని పిలుపునిచ్చారు. గడిచిన ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు ఎనలేని కృషి చేసారని, అందులో భాగంగానే నగర అభివృద్ధి కోసం కోవెలమూడి రవీంద్రకు మేయర్ పదవిని చంద్రబాబు కేటాయించారని దీనికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ పట్ల అంకిత భావంతో పని చేస్తే పదవులు వస్తాయని నగర మేయర్ రవీంద్ర, ఏపీఐడీసీ కార్పొరేషన్ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ కార్పొరేషన్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, సింహాద్రి కనకా చారి, మానుకొండ శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వర రావు, ఈరంటి వరప్రసాద్, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, శ్రీవల్లి, కసుకుర్తి హనుమంతురావు, సుఖవాసి శ్రీనివాస్, దాసరి జ్యోతి, చెంబేటి మణి కుమారి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ బహిరంగ సభను జయప్రదం చేయాలి

- తూర్పు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ ఉమాశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న శనక్కాయల ఉమాశంకర్, పాల్గొన్న బీజేపీ నాయకులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మే 2న జరిగే ప్రధాని మోదీ పర్యటన, భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని తూర్పు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట బీజేపీ కార్యాలయంలో జరిగిన మండల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ సభకు జిల్లా తరఫున ప్రతి మండలం నుంచి కార్యకర్తలను, అభిమానులను భారీ సంఖ్యలో పాల్గొనే విధంగా నాయకులు కృషి చేయాలన్నారు. బీజేపీ కార్యకర్తల కండువాలతో, జెండాలతో కాషాయమయంగా సభా ప్రాంగణం నిండిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మండల అధ్యక్షుడు సురేష్ కుమార్ జైన్, లక్ష్మణ్, పురుషోత్తం, రామకృష్ణ, శ్రీను, పవన్ కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతా సర్క్యులర్ అమలు చేయాలి

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ఉద్యోగ భద్రతా సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్టీఆర్ బస్టాండ్‌లో ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు మంగళవారం జరిగాయి. గుంటూరు-1, 2 డిపోల యూనియన్ కార్యదర్శులు డీవీ శంకరరావు, కేఎం రెడ్డి, టీఆర్ రాజు, వై.రవి, టీబీ కృష్ణ, ఎన్‌వీ స్వామి తదితరులున్నారు.

నీటి కుంటలతో.. జల సిరులు

- పెరగనున్న భూగర్భ జలాలు
- రైతులకు సాగు, మూగ జీవాలకు తాగునీరు


నీటి కుంటలకు కొలతలు తీస్తున్న అధికారులు

బొల్లాపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నీటి కుంటలతో జల సిరులు పెరగనున్నాయి. భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఉపాధి హామీ పథ కం అనుసంధానంతో గత టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వహిం చింది. నీటి కుంటలతో సాగుతో పాటు గేదెలు, ఆవులు, ఎడ్లు తదితర మూగ జీవాలకు తాగు నీరు అందుబాటులో ఉంటుంది. అలాగే రైతులకు అదనపు ఆదాయం సమకూరేలా నమూనాలను అభివృద్ధి చేశారు. ఐదు ఎకరాల్లోపు వారికి అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి నీటి కుంటల తవ్వకానికి అధికారులు నాలుగు నమూనాలను ఎంపిక చేశారు. ఉపాధి కూలీలకు ఈ నాలుగు నమూనాలను వరుసగా 120, 200, 420, 600 రోజుల పని దినాల పూర్తికి అవకాశం కల్పించారు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి స్వచ్ఛందంగా నీటి కుంటల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది రాష్ట్ర ప్రభుత్వం

నీటి కుంటల నిర్మాణం ఇలా..

ఐదు మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ.60వేలు, పది మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ 1.15 లక్షలు, 15 మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ.1.50 లక్షలు, 20 మీటర్ల చొప్పున వెడల్పు, పొడవు, రెండు మీటర్ల లోతు పంట కుంటల తవ్వకం కోసం రూ.2 లక్షలను కేటాయించారు. నమూనాలను కూడా రైతులు ఎంపిక చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. అంచల విధానంలో నిర్మించే కుంట గట్టు వెంబడి.. చుట్టూ పండ్ల మొక్కల పెంపకం, కాయ గూరలు, ఆకుకూరల సాగు, నీటిలో చేపల పెంపకం తదితర మార్గాల్లో అదనపు ఆదాయం పొంద వచ్చని ప్రోత్సహిస్తున్నారు. పంట కుంట నిర్వహణపై రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

వర్షా కాలం నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక

బొల్లాపల్లి మండల పరిధిలో 33 పంచాయతీల్లో 460 పంట కుంటల నిర్మాణమే లక్ష్యంగా నిర్దేశించు కున్నామని ఏపీవో లక్ష్మణ్ తెలిపారు. వర్షా కాలం(జూన్) నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే మండల పరిధిలో ఏడు నీటి కుంటలు పూర్తయ్యాయని చెప్పారు.

పసుపు ధర పతనం!

- ◆ మార్కెట్‌లో క్వింటా రూ.11 వేలు
- ◆ యార్డు విక్రయాలకు రైతులు విముఖత
- ◆ పెరిగిన పెట్టుబడులు, కౌలు అదనం
- ◆ ధర కోసం నిల్వ కేంద్రాల్లోనే పసుపు


దుగ్గిరాల యార్డులో రాశులుగా పోసిన పసుపు

దుగ్గిరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నానాటికీ తగ్గుతున్న ధరలతో పసుపు రైతుల్లో ఆందోళన నెలకొంది. ధరలు అంతంతమాత్రంగా ఉండటంతో రైతులు పసుపు విక్రయాలకు సుము ఖత వ్యక్తం చేయడం లేదు. కొత్త పసుపు యార్డుకు వచ్చే నాటికి ధరలు పెరుగుతాయన్న ఆశతో ఎదురు చూసిన అన్నదాతకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం మార్కె ట్‌లో పసుపు ధర క్వింటాకు సగటున రూ.11 వేల వరకూ పలుకుతోంది. వరుసగా రెండేళ్లపాటు పూర్తిస్థాయిలో నష్టాన్ని చవిచూడటంతో పసుపు సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపో యింది. సెంట్రల్ వేర్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీల్లో నిల్వపెట్టిన పసుపును విక్రయిస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అంతేకాకుండా నిల్వపెట్టిన పసుపునకు అద్దె కూడా చెల్లించలేని పరిస్థితిలో.. ధర కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఏడాది క్రితం క్వింటా రూ.14వేల వరకూ పలికిన పసుపు ధర క్రమేపీ తగ్గుతూ ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి రూ.11వేలకు చేరుకుంది. ఏప్రిల్ సీజన్ ప్రారంభ మయ్యే నాటికి ధరలు పెరుగుతాయన్న ఆశతో ఉన్న రైతులు.. నెల రోజులు గడుస్తున్నా ధర పెరుగుదల లేకపోవడంతో పసుపు విక్రయాలకు సుముఖత వ్యక్తం చేయడం లేదు.


పసుపు బస్తాల వద్ద దిగాలుగా ఉన్న రైతులు

యార్డులో తగ్గిన పసుపు విక్రయాలు

గతంలో సీజన్ ప్రారంభమవుతుందనగానే నిత్యం 1000 బస్తాల వరకూ పసుపు విక్రయాలు జరిగేవి. కనీసం మూడు నెలలపాటు ముమ్మరంగా విక్రయాలు కొనసాగేవి. నాలు గేళ్లగా 3 వేల బస్తాలు దాటి జరిగిన పసుపు విక్రయ రోజులు 20 కూడా లేవంటే అతిశయోక్తి కాదు. యార్డులో లభించే కూలిపై ఆధారపడి జీవించే హమాలీలు సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెరుగుతున్న పెట్టుబడి, కౌలు ధరలు

పసుపు ధరల్లో పెరుగుదల లేకపోగా ఏటా పంట పెట్టుబడి అధికమవుతూ వస్తోంది. గతంలో ఎకరాకు రూ.లక్షకు మించి ఖర్చయ్యేది కాదని, ప్రస్తుతం రూ. 1.75లక్షల వర కూ పెట్టుబడి అవుతోందని, కౌలు రూ.50వేల వరకూ చెల్లిస్తున్నామని రైతులు చెబుతున్నారు. దిగు బడులు అంతం త మాత్రంగా ఉండడంతో క్వింటాకు కనీసం రూ.13వేల ధర పలికితేనే పెట్టుబడి చేతికి వచ్చే పరిస్థితి ఉందని వాపోతున్నారు.

ప్రతిపాదనలు సరే.. పైసలేవి?

ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా పంట కాల్వలు

- 746 పనులకు.. రూ.25 కోట్లు అవసరమని ప్రతిపాదన
- నీటి తీరువా రూ.4 కోట్లు.. మిగిలిన నిధుల కోసం ఎదురుచూపు


వడ్డిముక్కల వద్ద పంట కాల్వలో పెరిగిన గుర్రపుడెక్క


శిథిలావస్థకు చేరుకున్న అలవల చానల్ షెట్టర్లు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పంట కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. కాల్వల దుస్థితి రైతులకు ఏటా సాగు నీటి కష్టాలను మిగిలిస్తోంది. ప్రధాన పంట కాల్వల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓఅండ్‌ఎం) పనులు గతంలో వేసవిలో చేపట్టి ఖరీఫ్ నాటికి ప్రవాహాలకు అడ్డంకులు లేకుండా చేసేవారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రైతుల సాగు నీటి వెతలు గుర్తించలేదు. వరుణుడి కరుణపైన రైతులు ఆధారపడి పంటలు సాగు చేశారు. కాల్వల నిండా నీటి ప్రవాహానికి అడ్డంగా గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు, సిల్ట్‌తో పూడిక పేరుకుని ఆనావాళ్లు లేకుండా పోయాయి. కాల్వల్లో పిచ్చి చెట్లు, గుర్రపుడెక్క జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నామని చెప్పిన గత పాలకులు పనులు చేపట్టకుండానే నిధులు కైంకర్యం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మరమ్మతులపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 746 పనులను గుర్తించి రూ.25.05 కోట్లు మంజూరు చేయాలని అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. 144 సాగునీటి సంఘాలు, 22 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఒక ప్రాజెక్టు కమిటీ పర్యవేక్షణలో ఆయా పనులు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కాల్వల మరమ్మతులకు రూ.25 కోట్లు అవసరం కాగా నీటి తీరువా కేవలం రూ.4 కోట్లే ఉంది. దీంతో సాగు నీటి శాఖ అధికారులు ప్రభుత్వం నుంచి నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదు. తాగునీటి అవసరాల కోసం మే 5 వరకు కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. మరో వైపు ముందస్తు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జూన్, జూలై నెలల్లోగా ఓఅండ్‌ఎం పనులు చేయాల్సి ఉంది. కొద్ది రోజుల మాత్రమే సమయం ఉన్నందున త్వరగా నిధులు సమకూర్చుకుని కాల్వల మరమ్మతులు చేస్తే ఖరీఫ్ నాటికి కాల్వలు సిద్ధమవుతాయి. లేదంటే ఈ ఏడాది కూడా సాగు నీటి కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందు తున్నారు.

హై సెక్యూరిటీ జోన్‌లోకి రాజధాని

- ప్రధాని మోదీ పర్యటనకు అసాధారణ భద్రత ఏర్పాట్లు
- కేంద్ర బలగాల ఆధీనంలోకి పర్యటన ప్రాంతం
- ఇప్పటికే విధుల్లో చేరిన ఐదువేల మందికిపైగా పోలీసులు
- డ్రోన్‌లు.. సీసీ కెమెరాల ద్వారా నిఘా
- చీమ చిటుక్కుమన్నా విరుచుకుపడేలా సాయుధ బలగాలు
- పోలీసులంతా అక్కడే.. అందరి చూపు, రూటూ అటే
- నేడు ప్రధాని పర్యటన ప్రాంతంలో ట్రయల్ రన్

గుంటూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రదాడి.. సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు.. దాయాది దేశం కవింపు చర్యలు. వంటి పరిణామాల నేపథ్యంలో మరి కొద్ది గంటల వ్యవధిలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఏపీ రాజధాని ప్రాంతంలో పర్యటనకు వస్తుండటంతో పోలీస్ శాఖ పూర్తిగా అప్రమత్తమైంది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రధాని పర్యటనకు అసాధారణ భద్రత ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పోలీసులందరి చూపు రాజధాని ప్రాంతంపైనే ఉంది. పోలీసులందరి దారి రాజధాని వైపే అన్నట్లుగా ప్రధాని పర్యటన బందోబస్తు విధుల్లో తలమునకలయ్యారు. వారంతా రాజధాని ప్రాంతంలోనే మకాం వేసి భద్రత ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సైరన్ మోతలు... కవాతు శబ్దాలతో రాజధాని ప్రాంతంలో ఎటు చూసినా పోలీసుల హడావుడే కనిపిస్తోంది. మ రోవైపు పోలీస్ ఉన్నతాధికారుల రాకపోకలు.. మంత్రులు, ఎమ్మెల్యే ల పర్యటనలతో ఆ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది.

రాజధాని ప్రాంతానికి చేరుకున్న ఎస్పీజీ కమాండోలు

ప్రధాని భద్రత నేపథ్యంలో స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కమాండోలు మంగళవారమే రాజధాని ప్రాంతానికి చేరుకొన్నాయి. ఆయా భద్రత ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత పోలీసు అధికా రులకు తగు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై కన్నేసాయి. అసాం ఘిక శక్తులకు ఏ మా త్రం ఆస్కారం ఇవ్వకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా పోలీ సుల బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఆ ప్రాం తం మంతా పోలీసుల కనుసన్నల్లోకి వెళ్లినట్లయింది. గూడాచారి వర్గాలు, రా(ఆర్ఏడబ్ల్యూ), కౌంటర్ ఇంటిలిజెన్స్, ఎన్ఐఏ, కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు అనుక్షణం ఆ ప్రాంతంలోని కదలికలను నిశితంగా గమనిస్తున్నాయి.

ప్రధాని పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు ఉన్నతాధికా రులు రాజధాని ప్రాంతంలో మకాం వేశారు. ముఖ్యంగా అదనపు డీజీతో పాటు ముగ్గురు ఐజీలు, నలుగురు డీఐజీలు, 35 మంది ఐపీఎస్ అధికారులను బందోబస్తుకు నియమించారు. దీంతో వారంతా మంగళవారం నుంచే

అదనపు డీజీతో సహా 35 మంది ఐపీఎస్‌లు రాజధానిలోనే..

తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో చేరారు. అదేవిధంగా మరో 15 మంది నాన్ కేడర్ ఎస్పీలు, మరో 15 మంది అదనపు ఎస్పీలు, 50 మంది డీఎస్పీలను నియమించారు. వీరందరికీ భద్రత విధులతో పాటు ట్రాఫిక్, పార్కింగ్, బారికేడ్‌లు, సభా వేదిక ప్రాంతాలు, సభకు వచ్చే వారికి అవసరమైన ఫలహారాలు, మంచినీరు, మజ్జిగ అందించే బాధ్యతలు అప్పజెప్పారు. మొత్తం మీద ప్రధాని పర్యటన నేపథ్యంలో సుమారు ఆరు వేల మంది పోలీసు అధికారులు, సిబ్బందిని బందోబస్తు చేయనున్నారు.

ప్రధాని సభా ప్రాంతానికి 9 రూట్లు

రాజధానిలో ప్రధాని మోదీ పాల్గొనే సభకు వెళ్లేందుకు ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేలా 9 రూట్లను ఎంపిక చేశారు. అదేవిధంగా 12 పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు. ఆ ప్రాంతంలో లైటింగ్‌తో పాటు మైక్ సిస్టం కూడా పటిష్టంగా ఏర్పాటు చేశారు. మరోవైపు బహిరంగ ప్రదేశంలో సీటింగ్‌తో పాటు ఎల్ఈడీ స్ర్కీన్‌లను కూడా ఉంచారు. వచ్చే వాహనాలకు, వేళ్లే వాహనాలకు ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేశారు. సభ ముగిసిన తర్వాత తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ సహా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు.

రాజధానిలో సాయుధ బలగాల మోహరింపు

పీఎం పర్యటన నేపథ్యంలో సాయుధ పోలీసు బలగాలు రాజధాని ప్రాంతంలో మోహరించాయి. చీమ చిటుక్కుమన్నా విరుచుకుపడేలా మెరికల్లాంటి ఎస్పీజీ బృందాలు రంగంలోకి దిగాయి. వీటితో పాటు గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్‌పీఎఫ్, ఏపీఎస్పీ, సీఆర్‌పీఎఫ్‌తో పాటు ఆర్మ్‌డ్ రిజర్వ్ బృందాలు ఆ ప్రాంతంలో మోహరించాయి. అంతేగాక బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఏరియా డామినేషన్ బృందాలు నిరంతరం ఆ ప్రాంతంలో గస్తీ తిరుగుతూ తనిఖీలు నిర్వహిస్తున్నాయి. మొత్తం మీద పీఎం పర్యటన దృష్ట్యా రాజధాని ప్రాంతం హై సెక్యూరిటీ జోన్‌లోకి చేరింది. దీంతో ఆ ప్రాంతమంతా పోలీసుల ఆధీనంలోకి చేరింది. ప్రధానికి ఆరంచెల భద్రత కల్పిస్తున్నారు. ఆయా భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు కేంద్ర హోంశాఖ నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది.

పోలీసులందరూ రాజధాని ప్రాంతానికి చేరుకున్నారు. ప్రధాని పర్యటనకు మరి కొద్ది గంటలే వ్యవధి ఉండడంతో కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలన్నీ రాజధాని ప్రాంతంలో మోహరించాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం నాటికే దాదాపు 5వేల మందికి పైగా పోలీసులు రాజధాని ప్రాంతానికి చేరుకున్నారు. నేడు మరో వెయ్యి మంది బలగాలు రానున్నాయి. బుధవారం మధ్యాహ్నం ప్రధాని పర్యటించే ప్రాంతంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. ట్రయల్ రన్ ప్రారంభంతోనే ప్రధాని పర్యటన ప్రాంతం పోలీసుల అధీనంలోకి వెళ్లనుంది. ప్రధాని పర్యటించే వీఐపీ మార్గంలోనూ... అదే విధంగా బహిరంగ సభ జరిగే పరిసరాల్లోనూ అడుగడుగునా పోలీసులు బందోబస్తు నియమించారు. ప్రధాని పర్యటన ముగించుకుని వెళ్లే వరకు బం దోబస్తు విధుల్లో ఉన్న పోలీసు పూర్తి అప్రమత్తంగా ఉండాలంటూ ఉన్నతాధికారులు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

పోలీస్ ఉన్నతాధికారులంతా అక్కడే మకాం

గుంటూరు, కృష్ణా జిల్లాల పోలీసు ఉన్నతాధికారులంతా


ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత, కలెక్టర్ నాగలక్ష్మి

ఎస్ఆర్ఎమ్, విట్, లాం చలపతిలో పోలీసులకు బస

రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్‌ల నుంచి పెద్దసంఖ్యలో పో లీసులను ప్రధాని పర్యటన బందోబస్తుకు నియమించారు. వారం దరికి రాజధాని ప్రాంతంలో వసతి సదుపాయం కల్పించారు. పీఎం పర్యటించే ప్రాంతానికి సమీపంలో ఉన్న ఎస్ఆర్ఎమ్, విట్ కళాశాలలో అత్యధిక మందికి వసతి సదుపాయం కల్పించారు. అదేవిధంగా లాం లోని చలపతి విద్యాసంస్థల్లో పెద్ద సంఖ్యలో పోలీసు అధికారులు, సిబ్బందికి నివాస సదుపాయం కల్పించారు.

సీసీ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక నిఘా

పీఎం పర్యటన నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా పోలీసులు కంట్రోల్ రూమ్ నుంచి ఆ ప్రాంతంపై నిఘా వేశాయి. ఇందుకు గాను సీసీ కెమెరాలు, డ్రోన్‌లతో ఆ ప్రాంతంలోని పరిస్థితులను, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాని పర్యటించే వీఐపీ మార్గంలో పెద్ద ఎత్తున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పీఎం రావడానికి గంట ముందు వరకు ఆ ప్రాంతలో డ్రోన్‌లను వినియోగించనున్నారు.

తొలగించిన చోటే

డాక్టర్ కోడెల విగ్రహం ఏర్పాటు

- వెల్లడించిన టీడీపీ జిల్లా కార్యాలయం
- 2న జయంతి సందర్భంగా ఆవిష్కరణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): లింగంగుంట్లలోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో అభిమానులు ఏర్పాటు చేసిన నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు విగ్రహాన్ని గతేడాది తొలగించారు. అదే చోట మళ్లీ అభిమానులు కోడెల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కోడెల జయంతి మే 2న విగ్రహం అవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం వెల్లడించింది. విగ్రహ అవిష్కరణకు పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరింది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను విగ్రహావిష్కరణను అహ్వానించినట్లు కోడెల అభిమానులు మంగళవారం తెలిపారు. కోడెల విగ్రహం తొలగింపు అప్పట్లో టీడీపీలో పెద్ద వివాదానికి దారి తీసింది. ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ఆదేశాల మేరకే విగ్రహం తొలగించామని అప్పటి ఆస్పత్రి అధికారులు వెల్లడంచడంతో అయన విమర్శలను ఎదుర్కొన్నారు. తొలగించిన చోటే కోడెల విగ్రహం ఏర్పాటు చేయాలని అయన అభిమానులు, పార్టీ నేతలు కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితర నేతలు కోడెల విగ్రహం ఏర్పాటు చేసి అయనకు తగిన గౌరవం కల్పిస్తామని నాడు హామీ ఇచ్చారు. నెలలు గడుస్తున్నా హామీ అమలు కాకపోవడంతో తొలగించిన.. ఆస్పత్రి స్టోర్ రూంలో పడేసిన కోడెల విగ్రహాన్ని అయన అభిమానులు తీసుకొచ్చి అక్కడే ఏర్పాటు చేశారు. అయన జయంతి రోజు విగ్రహం ఆవిష్కరించనున్నట్లు పార్టీ జిల్లా కార్యాలయం ప్రకటించడంతో వివాదంకి తెరపడినట్లయింది.

ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్న నాటికలు


పేగు రాసిన శాసనం నాటికలోని ఓ సన్నివేశం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక అంశాలపై రూపొందించిన నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. మండల పరిధిలోని పల్లెకోనలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న నాటకోత్సవాలు మూడో రోజుకు చేరాయి. హైదరాబాద్ వారి అన్నదాత నాటకాన్ని మొదటిగా ప్రదర్శించారు. శివప్రసాద్ దర్శకత్వం వహించగా కొల్లా రాధాకృష్ణ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. అన్నం పెట్టే రైతు నోట్లో అందరూ మట్టికొట్టేవాళ్లేనని.. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులతో మాఫియా ముఠా గంజాయి పండిస్తూ వారిని దోషులుగా చట్టం ముందు నిలబెడుతున్నారని.. దీనివల్ల రైతాంగం మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందనే ఇతివృత్తంగా సాగిన నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. చింతకింద శ్రీనివాసరావు రచించిన పేగు రాసిన శాసనం నాటికకు నాయుడు గోపి దర్శకత్వం వహించారు. గురజాడ కళా మందిర్ విజయవాడ వారి మూడవ నాటికగా మహా ప్రస్థానం ప్రదర్శించారు. ఈ నాటకాన్ని ఎం.సంజీవి రచించగా బిల్లా నటరాజ్ దర్శకత్వం వహించారు. సామాజిక అంశాలతో సాగుతున్న నాటకాలు ప్రేక్షకాదరణ పొందుతున్నాయి.

తవ్వకాల్లో బయటపడిన దేవతామూర్తుల విగ్రహాలు


శ్రీనివాసులు, పద్మావతి అమ్మవారు

దాచేపల్లి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని ఎస్సీ కాలనీ వద్ద పోలేరమ్మ గుడి పునఃప్రతిష్ఠ కార్యక్రమాల్లో జరుగుతున్న తవ్వకాల్లో పంచలోహ విగ్రహాలు బయటపడ్డాయి. మంగళవారం హోమగుండం నేలపై తవ్వకాలు జరుపుతుండగా సుమారు 9 నుంచి 10 అంగుళాలు పొడవు కలిగి 200 గ్రాములకు పైగా బరువు కలిగిన పంచలోహ విగ్రహాలు గడ్డపారకు తగిలాయి. వెంటనే మాజీ సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు, భక్తులు పరిశీలించగా శంకు చక్రాలు కలిగిన వెంకటేశ్వర్లు స్వామిగా, చేతిలో కమలంతో ఉన్న మూర్తిని పద్మావతి అమ్మవారిగా బావించి తక్షణమే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుండగా స్వామి వారి ఉత్సవమూర్తులు లభించడం శుభపరిణామంగా భక్తులు బావిస్తున్నారు. స్థానిక భక్తులు టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు.

పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెలాక్టు ప్రకాశం బ్యారేజి నుంచి 1316 క్యూసెక్కుల నీటిని మంగళవారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.4 అడుగుల నీటిమట్టం ఉండగా రేపల్లెకాల్వకు 190, తూర్పుకాల్వకు 128, పశ్చిమకాల్వకు 66, నిజాంపట్నం కాల్వకు 225, కొమ్మమూరుకాల్వకు 514 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన వేలంలో 779 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్టధర రూ.10,000, గరిష్టధర రూ.11,275, మోడల్‌ధర రూ.11,211 పలికాయి. కాయ కనిష్టధర రూ.10,500, గరిష్టధర రూ.11,275, మోడల్‌ధర రూ.11,200 పలికాయి.

విద్యార్థి ఆత్మహత్య

మంగళగిరిసిటీ, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): పరీక్షల వేళ ఒత్తిడిని తట్టుకోలేక ఓ విద్యార్థి యూనివర్సిటీ భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మంగళగిరి రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటకు చెందిన సీహెచ్ సుభాష్ అనే విద్యార్థి రాజధాని అమరావతి పరిధిలోని ఓ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం రెండో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలంటే భయం ఏర్పడి కొద్ది రోజుల నుంచి తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురయ్యాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో సుభాష్ తల్లిదండ్రులు కూడా రూం తీసుకుని కొద్ది రోజులుగా అక్కడే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సుభాష్ మంగళవారం యూనివర్సిటీ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని మంగళగిరి ఎన్నారై మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి మృతి

తుళ్లూరు(బోరుపాలెం), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలపరిధిలోని బోరుపాలెంలో మంగళవారం జరిగింది. అనారోగ్య కారణాలతో డి.కోటేశ్వరావు(30) ఆత్మహత్య చేసుకున్నాడు. అతనికి తల్లిదండ్రులు లేరు. వివాహం కాలేదు. సోదరి దగ్గర ఉంటున్నాడు. అతడి నడవడిక సరిగా లేకపోవటంతో సోదరికి కూడా ఇంటికి రావద్దని చెప్పింది. బోరుపాలెం ఇసుక ర్యాంపునకు వెళ్లే మార్గంలో క్రేన్‌లకు కోటేశ్వరావు కాపలా ఉంటున్నాడు. అక్కడే ఒక పాకలో తాడుతో ఉరేసుకొని చనిపోయినట్టు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

● బీటెక్ విద్యార్థి మృతి

మార్టూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మార్టూరు మండలపరిధిలో కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న సంఘటన మంగళవారం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న గుంటుపల్లి భరణ్(19) తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న మరో యువకుడు నల్లిబోయిన ప్రవీణ్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గంమధ్యలో భరణ్ చనిపోయాడు. మృతుడు మేడికొండూరు మండలం, డోకిపర్రు గ్రామానికి చెందిన వాడు. అతడు తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి ఒంగోలులో ఒక కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ ఫీజు కట్టి వస్తున్నాడు. ఒంగోలు నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుంటూరు జిల్లా నల్లపాడు గ్రామానికి చెందిన కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. భరణ్ మృతదేహం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉంది. అదేవిధంగా ప్రవీణ్‌కు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. మార్టూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


అళ్ల కోటిరత్నమ్మ

మంగళగిరిసిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు అళ్ల కోటి రత్నమ్మ (104) సోమవారం రాత్రి కన్నుమూశారు. ఆమె కుమారుడు అళ్ల రంగారెడ్డి గతంలో మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ధర్మకర్తగా పనిచేశారు. శతాధిక వృద్ధురాలు కోటిరత్నమ్మ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాపితంగా మే 29వ తేదీన జరుగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నేతలు మాట్లాడుతూ కార్మికవర్గం ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గమన్నారు. నిరంకుశ కార్మిక చట్టాల రద్దు, కార్మిక హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.15 రోజులు ముందుగా సమ్మె నోటీసు ఇవ్వాలని, 17న బైకు ర్యాలీ నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, కార్మిక సంఘాల నేతలు ఎం.బాలాజీ, అన్నవరపు ప్రభాకర్‌రావు, చెంగయ్య, వీసం జవహర్ లాల్, రావులు, పీ.బాలకృష్ణ, టీ.శ్రీరాములు, టీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనతో రూ.2లక్షల కోట్ల నష్టం

● రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

● ప్రధాని పర్యటనను జయప్రదం చేయాలి : ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

● గుంటూరులో ప్రధాని మీటింగ్ సన్నాహక సమావేశం


ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న మంత్రి అనగాని, శ్రావణ్‌కుమార్ తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి అరాచక పాలన వల్ల 2 లక్షల కోట్ల రూపాయల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యా సంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోవడంతో లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పర్యటన నేపథ్యంలో టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన తాడికొండ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ప్రధాని మీటింగ్ పరిశీలకుడిగా మంత్రి అనగాని సత్యప్రసాద్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన రాష్ట్ర కలల రాజధాని అమరావతి శంకుస్థాపనకు మే 2న వస్తున్నారని తెలిపారు. రాష్ట్రం అప్పులు పాలై తీవ్ర సంక్షోభానికి గురై నేటికి కోలుకోలేని స్థితిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను సీఎం చంద్రబాబు అభివృద్ధి పథంలో నడిపేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని పనులు పరుగులు పెడుతున్నాయన్నారు. రాజధాని పూర్తయితే పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చి భూముల ధరలు పెరిగి ప్రజల జీవనవిధానమే మారిపోతుందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మే 2న రాజధాని అమరావతిలో లక్ష కోట్ల రూపాయల విలువైన పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేందుకు ప్రధాని మోదీ చేతుల మీదుగా మరోసారి కూటమి ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందన్నారు. అమరావతి రాజధాని ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించబోతోందని చెప్పారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ దేశమంతా గుర్తించేలా అమరావతి నిర్మాణం జరుగుతుందని చెప్పారు. 175 నియోజకవర్గాలకు ఉద్యోగ కల్పవల్లిగా అమరావతి అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, నూతలపాటి రామారావు, కంతేటి బ్రహ్మయ్య, కొత్తపల్లి కోటేశ్వరరావు, ధనేకుల సుబ్బారావు, మల్లిపెద్ది రమేష్, మండవ నరసింహారావు, తలతోటి సురేంద్ర, షేక్ అబ్దుల్ గని, షేక్ జానీ బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయాలి

● తాడేపల్లి, దుగ్గిరాలలో కూటమి నేతల సమావేశం

● మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ


దుగ్గిరాల జంపాల కాంప్లెక్స్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. తాడేపల్లి పట్టణంలోని గౌడ కల్యాణ మండపంలో మంగళవారం ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ తాడేపల్లి పట్టణం, రూరల్‌లోని అన్ని గ్రామాలు, వార్డుల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో మోదీ సభకు హాజరు కావాలన్నారు. సభకు వచ్చే వారందరికీ వాహనాలు, భోజనాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నో కుట్రలు చేసిందని, కూటమి అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలోనే అన్ని అడ్డంకులను అధిగమించి ప్రజా రాజధాని నిర్మాణాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. జగన్ ఐదేళ్ల పాలనలో ఏపీ రాజధాని అమరావతిని కుప్పకూల్చాడని, ఎక్కడి పనులు అక్కడ ఆపేశాడని విమర్శించారు. రోడ్లను తవ్వేసి వైసీపీ నేతలు, కార్యకర్తలకు దోచిపెట్టాడని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం కాంట్రాక్టర్లు తెచ్చిన మెటీరియల్‌ను కూడా వైసీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు తమ అనుచరులతో దోపిడీ చేయించారని చెప్పారు. రాజధాని పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లను తన్ని తరిమేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకుడు సత్యనారాయణ, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, మండల ప్రధాన కార్యదర్శి శేషు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

● **దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి):** అమరావతికి వస్తున్న ప్రధాని మోదీకి ఘనస్వాగతం పలికేందుకు సిద్ధం కావాలని మంత్రి గొట్టిపాటి అన్నారు. స్థానిక జంపాల కాంప్లెక్స్‌లో జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో నిలిచిపోయిన అమ రావతిని పునర్నిర్మాణ పనులను పునఃప్రారంభించేందుకు వస్తున్న మోదీ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. సమావేశంలో తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ, నియోజకవర్గ పరిశీలకుడు సత్యనారాయణ, ఎంపీపీ షేక్ జబీన్, పసుపులేటి సాయి చైతన్య, కేసంనేని శ్రీఅనిత, జనసేన అధ్యక్షుడు శ్రీనివాసరావు, బీజేపీ అధ్యక్షుడు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ సహకారంతో కుట్టుమిషన్ల పంపిణీ

● స్త్రీ శక్తి 69వ బ్యాచ్‌లో 75 మంది మహిళలకు శిక్షణ


శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న తెలుగుమహిళ నాయకులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా 75 మంది మహిళలకు మంగళవారం ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. స్త్రీ శక్తి 69వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన మహిళలకు మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎమ్మెస్సెస్ భవన్‌లో నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మీ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు అందజేశారు. కుట్టు మిషన్లు అందుకున్న మహిళలు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య మాట్లాడుతూ మంత్రి లోకేశ్ అందిస్తున్న కుట్టు మిషన్లతో అనేక మంది మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధితోనే సమాజ ప్రగతి సాధ్యమని భావించిన కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ మహిళలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుమహిళ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, సింహాద్రి బేబీరాణి, వాసా పద్మ, అప్పల శాంతి, యలమంచిలి పద్మజ, వుడతా లావణ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

పెదనందిపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే వేడుకలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అనేక సంవత్సరాలుగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడి దారులకు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా చట్టాలు మార్పుచేశారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం మేడే స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, నాయకులు జంపని రామారావు, కాపు వెంకటసుబ్బారావు, ముద్దన వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● **తాడేపల్లి టౌన్ (ఆంధ్రజ్యోతి):** మేడే వేడుకలను జయప్రదం చేయాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య పిలుపునిచ్చారు. మంగళవారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాశయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందన్నారు. నెల 20న తలపెట్టిన అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా పోలేరమ్మ, అద్దంకమ్మ తిరునాళ్ల

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనంతవరప్పాడులో గ్రామ దేవతలుగా ఆరాధించే పోలేరమ్మ, అంకమ్మ తిరునాళ్ల ఎంతో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ప్రధాన ఘట్టమైన సిడిమాను మహోత్సవం కన్నుల పండుగలా జరిగింది. ఉదయం నుంచి ఆలయ వద్ద గ్రామస్థుల మొక్కుబడులతో కిక్కిరిసి పోయింది. సిడిమాను మహోత్సవానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు.

● మండల పరిధిలోని ముట్లూరులో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవం కన్నుల పండుగలా జరిగింది. మంగళవారం వేలాది మంది భక్తులతో కుంకుమ బండి ఊరేగింపు అనంతరం అమ్మవారికి కుంకుమను సమర్పించారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం

● ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు

పెదనందిపాడు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఏ వయస్సు వారికైనా పుస్తక పఠనం ద్వారా లభించే జ్ఞానం జీవితాంతం వారి వెంటే ఉండి భావి జీవితాన్ని తేజోవంతం చేస్తుందని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా ఎంతో మేధస్సు పెరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి చదవడం, రాయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, గణితంలో సంఖ్యామానం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్, జనరల్ నాలెడ్జ్ గురించి విద్యార్థులకు వివరించారు.

అమరావతి పరిరక్షణ కమిటీ చైర్మన్‌గా చిలకా


చిలకా విజయ్

తుళ్లూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రైతులు, రైతుకూలీల సమస్యలను అధ్యయనం చేస్తూ నిత్యం వారి సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ అధిష్టానానికి తెలియజేసేలా ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఆరుగురితో కమిటీని మంగళవారం నియమించారు. ఆ కమిటీలో గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలకా విజయ్ నాయకత్వం వహించనున్నారు. మొదటి నుంచి అమరావతి రైతుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తూ ఉందని చిలకా అన్నారు. ఇక ముందు కూడా రైతులకు అండగా ఉంటుందన్నారు.


కర్రసాముకు విస్తృత ప్రచారం కల్పించాలి

● డీఎస్‌డీవో నరసింహారెడ్డి


సర్టిఫికెట్స్, పతకాలు అందుకున్న విజేతలతో డీఎస్‌డీవో నరసింహారెడ్డి

గుంటూరు (తూర్పు), ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళైన కర్రసాముకు విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా క్రీడా ప్రాధికార అధికారి పీ నరసింహారెడ్డి అన్నారు. రూరల్ మండలం పొత్తూరు గ్రామం, ఎసీఎమ్‌ఈ పాఠశాలలో సిలబం కర్రసాములో నోబుల్ బుక్ ఆఫ్ రికార్డు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కర్రసాముతో స్వీయ రక్షణ లభిస్తుందని, ప్రతి విద్యార్థి దీనిపై శిక్షణ పొందాలని సూచించారు. బాల, బాలికల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. అనంతరం విజేతలకు పతకాలు, సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరక్టర్ నందమూరి సొధన్, స్టిక్ ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ క్రిస్టోఫర్, డి.అశోక్‌బాబు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై పనిముట్ల పంపిణీ


రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న కిరణ్‌చంద్, పార్థసారధి తదితరులు

మంగళగిరి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎస్ఎంఏఎం వ్యవసాయ యాంత్రీ కరణ పథకంలో భాగంగా చినకాకాని, పెదవడ్లపూడి గ్రామాల్లోని రైతులకు యాభై శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లను మంగళవారం పంపిణీ చేశారు. మంగళగిరి మండలంలో రూ.7 లక్షల మేర సబ్సిడీ వర్తించే పరికరాలను అందజేశారు. వేసవి కాలంలో అపరాల సాగుకు 50 శాతం రాయితీతో విత్తనాలు, పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు అందజేస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారి శైలజారాణి తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు యేళ్ల శివరామయ్య, నేతలు మాదల రమేష్‌బాబు, ఉద్యాన శాఖ, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

రైల్వే గడ్డర్‌ను ఢీకొన్న లారీ

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ కట్ట నుంచి సీతానగరం వెళ్లే దారిలో బోటు యార్డు వద్ద ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించే గడ్డర్‌ను టిప్పర్ లారీ ఢీకొట్టింది. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్టుగా సమాచారం. వేగ నియంత్రణ లేక పోవడంతో వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు


నివాసాలు కోల్పోయిన వారికి చెక్కులను పంపిణీ చేస్తున్న బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రత్తిపాడు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక విద్యానగర్, క్యాంపు కార్యాలయంలో ఇన్నర్ రింగ్ రోడ్డు త్రీఫేజ్ విస్తరణలో భాగంగా నివాసాలు కోల్పోయిన వారి కి చెక్కులను పంపిణీ కార్యక్రమం జరిగింది. రెండో విడతలో భాగంగా 90 నివాసా గృహాలకు సంబంధించి దాదాపు రూ.94 లక్షల విలువ కల్గిన చెక్కులను ఆయన అందజేశారు. దీంతో పాటు ప్రభుత్వ, అక్రమణ స్థలాల్లో నివాసాలు కోల్పోయిన వారికి ఎమ్మెల్యే సొంత నిధుల నుంచి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణకు స్థానికులు, చిరు వ్యాపారులు సహకరించాలని అన్నారు. ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ప్రణాళికాధికారి రాంబాబు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కల్లూరు శ్రీనివాసరావు ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచుమర్తి శేషు, బుర్రి సురేష్, సుశీల, మస్తాన్, సౌరి, నాగరాజు, కిరణ్, 41, 46 కార్పొరేటర్లు బొడ్డుపల్లి స్మిత పద్మజ, నూకవరపు బాలాజీ పాల్గొన్నారు.

రాజధాని పునఃప్రారంభ ఆహ్వాన పత్రికలు అందజేత


ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి

తాడేపల్లి(పెనుమాక), ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పనులు పునఃప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభకు సంబంధించి ఆహ్వాన పత్రికలను పెనుమాక గ్రామంలోని పలు వార్డుల్లో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఇంటింటికి వెళ్లి రాజశేఖర్‌రెడ్డి స్థానిక నేతలు ఈ ఆహ్వాన పత్రికను అందజేసి సభను విజయవంతం చేయాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితురాలికి ఆర్థికసాయం


నన్నిబీకి ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పెదవడ్ల పూడిలోని కొత్తపాలెంకు చెందిన షేక్ నన్నిబీ ఈ నెల 25వ తేదీన వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదై బాధితురాలు కట్టుబట్టలతో ప్రాణాలను దక్కిం చుకుంది. స్థానిక నేతల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ మంగళవారం నాయకులను బాధితురాలి ఇంటి వద్దకు పంపించి రూ.15 వేల ఆర్థికసాయం అందజేయించారు. ఈ సందర్భంగా మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ మాట్లాడుతూ బాధితురాలికి కూటమి ప్రభుత్వం తరపున న్యాయం చేస్తామని, కొత్త ఇల్లు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు శివరామయ్య, జనసేన పార్టీ అధ్యక్షుడు దుర్గారావు, నేతలు మాదల రమేష్‌బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

దుగ్గిరాల, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘ జిల్లా కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. దుగ్గిరాల, ఈమని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలను మంగళ వారం బాలరాజు కలిసి వారితో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు చెల్లిస్తామన్న రూ.307 అమలు చేయడంలేదని, ఎండలో ఉదయం 11గంటల వరకూ పనిచేస్తున్నా, మంచినీటి సౌకర్యం కూడా కరువైందని తమకు ఉపాధి కూలీలు చెప్పారన్నారు. పని దినాల సంఖ్య పెంచాలని, వేతనాలు సకాలంలో చెల్లించాలని బాలరాజు డిమాండ్ చేశారు. చెంచురావు, బాబూరావు, పెద్దన్న, కృష్ణమూర్తి, సత్యనారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బండరాళ్లతో కొట్టి చంపుతున్న వీడియో వైరల్

● లభ్యంకాని హతుడి వివరాలు, నిందితుల ఆచూకీ

మేడికొండూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరేచర్లలో గుర్తు తెలియని వ్యక్తి ఆదివారం దారుణ హత్యకు గురైన విషయం విదితమే. మృతదేహం గుర్తించి శవ పరీక్షకు పంపిన పోలీసులు మృతుడి వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇదిలా ఉండగా పేరేచర్లలో ఒక వ్యక్తిని నలుగురు వ్యక్తులు బండరాళ్లతో కొట్టి చంపుతున్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈవీడియో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ప్రాంతంలోనిదేనని నిర్ధారించుకున్న పోలీసులు వీడియోలో ఉన్న వ్యక్తుల కోసం వేట ప్రారంభించారు. ఇప్పటివరకు మృతునికి సంబంధించిన వివరాలు కూడా పోలీసులకు లభ్యం కాలేదు. గుర్తు తెలియని వ్యక్తిహత్యగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహం ఫోటో తీసి వివిధ ప్రాంతాలకు వెళ్లి ఆరాతీశారు. అయినా ఆచూకి తెలియరాలేదు. జిల్లా వ్యాప్తంగా వ్యక్తి అదృశ్యం కేసు కూడా ఎక్కడా నమోదు కాకపోవడంతో మిస్టరీగా మారింది. సోషల్ మీడియాలో దొరికిన వీడియోలో వ్యక్తిని నలుగురు వ్యక్తులు రాళ్లతో కొడుతున్న దృశ్యాన్ని పరిశీలించిన పోలీసులు ఆ వీడియోలో ఉన్న వ్యక్తుల గురించి తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేడు పురపాలక సంఘ సాధారణ సమావేశం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): నేడు బుధవారం పురపాలక సంఘం సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక తెలిపారు. పురపాలక సంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఉదయం 11గంటలకు సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తామని మునిసిపల్ కౌన్సిల్ సభ్యుడు, ఎక్స్ అఫీషియో మెంబర్లు, కో ఆప్షన్ సభ్యులు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని చైర్‌పర్సన్ రాధిక మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పలు గ్రామాలలో అగ్ని ప్రమాదాలు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాలలో మొక్కజొన్న చేలలలో అగ్నిప్రమాదాలు సంభవించాయి. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదరావూరు గ్రామంలో మొక్కజొన్న చేలలలో మంటలు చేలరేగాయి. ఇది గమనించిన రైతులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అజాగ్రత్త వలన అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. అగ్నిప్రమాదంలో పంట నష్టం సుమారు రూ.1.5లక్షలు, ఇదే గ్రామం గోశాల వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో 7 ఎకరాల పంట నష్టం సుమారు రూ.70 వేలు, కొలకలూరులో జరిగిన అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంట నష్టం సుమారు 5 వేలు అని ఫైర్ సిబ్బంది తెలిపారు. ఈ అగ్నిప్రమాదాలను అదుపులోకి తెచ్చిన సిబ్బంది లీడింగ్ ఫైర్‌మాన్‌లు కేజే కుమార్, కె వెంకట్రావు, డ్రైవర్ ఆపరేటర్ వి చంద్ర మోహన్, ఫైర్‌మాన్లు పీవీ సుబ్బారావు, ఎస్ రాజేష్, బి శ్రీనివాసరావు, జీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును పరిశీలించాలి: ఎంపీడీవో

కొల్లిపర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రం కొల్లిపర సచివాలయాన్ని ఆమె తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సచివాలయం సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ప్రజల నుంచి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలనను తప్పనిసరిగా పాటించాలని లేకపోతే తగిన చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు.

ఉష్ణోగ్రతలపై ఉపాధి కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలి: ఏపీవో

కొల్లిపర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలు ఉష్ణోగ్రతలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీవో వెంకయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వల్లభాపురం, పిడపర్తిపాలెం, కొల్లిపర, అత్తోట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ పేదప్రజలు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే కూలీలకు కొలతలు బట్టి వేతనం చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వల్లభాపురం బుజ్జిబాబు, కనపర్తి సాగర్, వి.రాజేంద్ర, కోటేశ్వరరావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. మంగళవారం అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు మొవ్వా విజయలక్ష్మి జ్ఞాపకార్థం భర్త మొవ్వా సత్యనారాయణ మనుమరాళ్లు హాసిత, అవంతి, కుటుంబ సహకారంతో పాదచారులకు చల్లని మజ్జిగ, మంచినీరును పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొవ్వా సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, ప్రతాప్, అబ్దుల్ రజాక్, వాసు, ప్రదీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లోని షిరిడి సాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఎస్వీ యోగా సభ్యులు వల్లూరు నీలిమ 4వ వర్ధంతి సందర్భంగా ఆమె భర్త రమేష్, కుమార్తె గాయత్రి సంజన, కుటుంబ సభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీచేసి అన్నదానం చేశారు. ముందుగా నీలిమ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సేవా కేంద్రం కన్వీనర్ ఎం.రమణయ్య, శివసుబ్రహ్మణ్యం, సాంబాజ్యం, నాగరాజు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు లేక ఆసుపత్రిలో రోగుల ఇక్కట్లు

● నీరు లేక నిరుపయోగంగా కూలర్లు
● దాహార్తిని తీర్చాలని పలువురి విజ్ఞప్తి



వార్డులో దాహార్తిని తీర్చుకునేందుకు ఏర్పాటు చేసుకున్న మినరల్ వాటర్‌క్యాన్, తాగునీరు లేక నిరుపయోగంగా ఉన్న వాటర్‌కూలర్



ప్రమాదకరంగా ఉన్న కూలర్లకు ఏర్పాటుచేసిన విద్యుత్ స్విచ్‌బోర్డు

తెనాలి రూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో తాగునీటి కోసం రోగులు వారి బంధువులకు ఇక్కట్లు తప్పడంలేదు. వైద్యశాలలో ఆరోగ్యశ్రీ వార్డు, జనరల్ వార్డులలో మొత్తం కలిపి నాలుగు కూలర్లు ఉన్నాయి. వీటికి ఒక్కో కూలర్ దాదాపుగా 20లీటర్ల సామర్థ్యం కలిగినవి కావడంతో వందమందికి పైగా వచ్చే వార్డులకు తాగునీరు సరఫరాల చాలడంలేదు. దీంతో ఆసుపత్రిలో ఉండే రోగుల కోసం బంధువులు బయటనుంచి మినరల్ వాటర్ క్యాన్ తీసుకువచ్చే పరిస్థితి ఉంది. పలు వాటర్ కూలర్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ బోర్డులు సరిలేక ప్రమాదకరంగా ఉన్నాయి. ఆరోగ్యశ్రీ వార్డుకు ఒక వాటర్ కూలర్ ఉండగా ఆర్థోపెడిక్ ఫిమేల్ వార్డు వద్ద మరొక కూలర్ ఉంది. కింద ఓపీ వద్దకు వచ్చే వారు సద్వినియోగం చేసుకునేలా మెట్లకింద ఇంకొక కూలర్ ఏర్పాటుచేశారు. ఇవికాక కింద భాగంలో వార్డులకు వెళ్లే క్రమంలో మరో వాటర్ కూలర్ ఉంది. అత్యవసర విభాగం వంటి ప్రాంతాల్లో తాగునీటి కూలర్లు లేవు. ఎండాకాలం తాగునీటి కోసం ఇక్కట్లు పడుతున్నామని రోగులు, బంధువులు వాపోయారు. ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. తాగునీటి సమస్యపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణిని వివరణ కోరగా వేసవి కాలం కావడంతో తాగునీటి వాడకం పెరిగిందన్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా ఇనుప రాడ్డు

తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాల్లోని ఆరోగ్యశ్రీ వార్డుకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన షెడ్డుకు అమర్చిన ఇనుప రాడ్డు కింద భాగంలో విరిగి వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. అటుగా వెళ్లే రోగులు లేదా వారి బంధువులు చూడక రాడ్డుకు తగిలితే గీచుకుపోయే ప్రమాదం ఉంది. అంతే కాకుండా వేలాడుతున్న రాడ్డును ఎవ్వరైనా బలంగా పట్టుకున్నా అది ఊడి కిందపడే అవకాశం లేకపోలేదు. ఆసుపత్రి అధికారులు దానిని పరిశీలించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఆరోగ్యశ్రీ వార్డుకు వెళ్లే షెడ్డు వద్ద విరిగి వేలాడుతున్న ఇనుప రాడ్డు



ఎమ్మెల్సీ బీటీ నాయుడును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ శ్రేణుల పనితీరు అభినందనీయం

● ఎమ్మెల్సీ బీటీ నాయుడు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ శ్రేణులు పనితీరు అభినందనీయమని ఎమ్మెల్సీ బీటీ నాయుడు పేర్కొన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన ఆయనను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృష్ణా, గుంటూరు శాసన మండలి గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో ఓటర్లను చేర్పించడంతో, ప్రచారం చేయడంలో, ఓటింగ్ చేయించడంలో కార్యకర్తలు నాయకులు బాగా పని చేశారని అభినందించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీ పరిశీలకునిగా కూడా పనిచేసిన తాను కార్యకర్తల ఉత్సాహాన్ని గమనించానని చెప్పారు. పార్టీ నాయకులు కరిముల్లా, కేసన కోటేశ్వరరావు, వంగా సాంబిరెడ్డి, మహ్మద్ ఖుద్దూస్, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, హరిదాసు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రూరల్ గ్రామం సంగంజాగర్లమూడి కొమ్మూరు కాలువలో సోమవారం ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యమైంది. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఈ మృతదేహాన్ని గుర్తించారు. తెనాలి చెంచుపేటకు చెందిన ప్రసాద్ (23) సోమవారం సంగమేశ్వరాలయం ఎదుట ఈతకు దిగి గల్లంతయ్యాడు. కొమ్మూరు కాలువ నీటిలో తేలియాడుతుండగా గుర్తించిన పోలీసులు ఈతగాళ్ల సాయంతో బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనపై కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు.



మొక్కలతో బ్రిడ్జికి ముప్పు

● కొలకలూరు వంతెనకు అల్లుకుంటున్న రావి చెట్లు
● తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం

బ్రిడ్జిపై మోడుగా మారుతున్న రావి చెట్టు, బ్రిడ్జిపై అల్లుకున్న మొక్కలు

తెనాలిరూరల్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివెలుగు నుంచి కొలకలూరుకు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన ఫ్లైఓవర్ బ్రిడ్జికి పిచ్చిమొక్కలు, రావి చెట్లు అల్లుకున్నాయి. సంవత్సరాల తరబడి ఈ చెట్లు బ్రిడ్జి లోపల నుంచి వేర్లుగా మారిపోయి అవి క్రమేపీ పెరిగి మోడులా మారి పెద్దవృక్షాలుగా ఎదుగుతున్నాయి. దీంతో బ్రిడ్జి పటుత్వం కోల్పోయి దెబ్బతినే ప్రమాదం ఉంది. బ్రిడ్జి దెబ్బతింటే నందివెలుగు నుంచి కొలకలూరు మీదుగా గుంటూరు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. రూ.కోట్లతో నిర్మించిన బ్రిడ్జి సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి దెబ్బతినకముందే మొక్కలు, వృక్షాలు తొలగించి రక్షణ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బ్యాంకర్స్ కాలనీలో పారని మురుగు

● 2020లో సీసీ రోడ్లు ఏర్పాటు
● డ్రెయిన్లు ఏర్పాటు చేయని వైనం
● మురుగు మధ్యనే వంద కుటుంబాలు
● మురుగు పారుదలకు చర్యలు చేపట్టాలని స్థానికుల వినతి

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్‌లోని బ్యాంకర్స్ కాలనీలో రోడ్లపై మురుగు నీరు పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. ఐతానగర్‌లోని బ్యాంకర్స్ కాలనీలో 2022 సీసీ రోడ్లను నిర్మించారు. దానికి అనుసంధానంగా మురుగు పారుదలకు కాలువలను నిర్మించలేదు. ఆ రోడ్లకు ఇరువైపులా వందలాది కుటుంబాలు నివసిస్తున్నారు. ఆ ఇండ్లకు రాకపోకలు సాగించేందుకు రోడ్లు సమకూరాయని ఆనందం ఒక పక్క ఉంటే కాలువలు లేక మురుగు పారక దుర్గంధంతో జీవనం సాగించలేక మనోవేదనకు గురయ్యే పరిస్థితి స్థానికుల్లో నెలకొంది. డ్రెయిన్లు లేక ఇంటి సమీపంలోనే మురుగు తెట్టలుగా నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇదేవిధంగా ఆ నీటిలో వ్యర్థాలు చేరి దుర్గంధం వెదజల్లుతూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. కొన్ని ప్రాంతాల్లో ఇండ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్లపై చేరి ఇబ్బందులు పడుతున్నారు.



డ్రెయిన్లు లేక నిలిచిన మురుగు

అధికారులు పట్టించుకోవడం లేదు ...

మా కాలనీలో నాలుగేళ్లగా కాలువల గురించి మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తున్నా ఎటువంటి స్పందన లేదని స్థానికుడు ఎం.కృష్ణ ఆరోపిస్తున్నాడు. నివాసాల మధ్య మురుగు పారుదలకు కాలువలు లేకపోతే మురుగునీరు బయటకు ఎలా పోతుందన్నాడు. వివిధ పన్నులు విధిస్తున్నా మున్సిపాలిటీకి స్థానికుల బాధలు పట్టవంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దోమలతో ఇబ్బందులు పడుతున్నాం

బ్యాంకర్స్ కాలనీలో కాలువలు లేకపోవడంతో ఇంటి అవసరాలకు వినియోగించిన నీరు రోడ్లపైకి చేరి, ఇంటి సమీపాలలోనే నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతూ దోమలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికురాలు శైలజరాణి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు కాలనీలో ఎక్కువగా నివసిస్తున్నారని పగలు రాత్రి తేడాలేకుండా దోమలు సంచరిస్తూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోయారు. డ్రెయిన్ల సమస్యలపై అధికారులు దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆమె కోరారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పెరిగిపోతున్న దొంగతనాలు

● భయాందోళనలో ప్రజలు
● నిఘా పెంచాలంటున్న గ్రామస్థులు

కొల్లిపర, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. రోజు, రోజుకి గ్రామాల్లో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా దొంగలు బరి తెగిస్తున్నారు. తాళం వేసిన ఇంటిని ఎలా కొల్లగొడుతున్నారో అర్థం కాదు. సినిమా రేంజ్‌లో ప్లాన్ చేసి అందినకాడికి దొంగలు దోచుకుంటున్నారు. డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండల గ్రామాల్లో ఏక్కడో ఒకచోట దొంగతనం జరుగుతూనే ఉంది. ఈ వరుస దొంగతనాలు ఇటు పోలీసులకు సవాల్‌గా మారుతోంది. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ నిర్వహించినా దొంగతనాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి. రెండు నెలలుగా మండలంలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, చెముడుబాడు తదితర గ్రామాల్లో చోరీలు అధికమయ్యాయి. పట్టపగలే దొంగతనాలు జరగటం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. దొంగలు ఇంటి తాళాలు, బీరువానుపగుల గొట్టి దొంగతానికి పాల్పడుతున్నారు. వరుస దొంగతనాలతో ప్రజలు బయటకు పోవాలంటేనే హడలిపోతున్నారు. ఇటీవల దీనిపై మంత్రి మనోహర్ కూడా దృష్టిసారించి దొంగతనం జరిగిన నివాసాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. పోలీసులకు గస్తీని పెంచాలంటూ పలు సూచనలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మండలంలోని గ్రామాల్లో దొంగతనాలు జరగటంతో ప్రజల అజాగ్రత్తలు కూడా కారణమని పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా ఇంటికి తాళం వేసి వెళ్ళె ముందు ఇంట్లో విలువైన వస్తువులు, అభరణాలు, నగదు ఉంచవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే 20 రోజులు క్రితం కొల్లిపర గ్రామస్థులు పోలీసుస్టేషన్‌కు వచ్చి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తున్నారని గంజాయి, మద్యం మత్తులో ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఎస్ఐ కోటేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. దొంగతనాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను పటిష్టం చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. దొంగతనాలపై పోలీసుల నిఘా వైఫల్యం కూడా ఉందని గ్రామస్థులు పలువురు ఆరోపిస్తున్నారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంగా మారిందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం శేకూరు గ్రామానికి చెందిన గైడుబోయిన రమాదేవికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు అయిన రూ.44,406 నగదు చెక్కును ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణ చికిత్సపై అవగాహన

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందులపేట ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పట్టణ టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ రవికుమార్ టీబీ నివారణ చికిత్సపై క్షయవ్యాధిగ్రస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు ఆదేశాలతో జిల్లా డ్రగ్‌స్టోర్ ఇన్‌చార్జ్ కరిముల్లా సూచనలతో టీబీ ప్రివెన్షన్ థెరపీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. గత రెండు వారాల నుంచి ఊపిరితిత్తుల క్షయ వ్యాధికి మందులు వాడుతున్న కుటుంబ సభ్యులకు టీబీ టెస్ట్‌లను నిర్వహించామని ఎవరికైతే 5 ఎంఎం కంటే ఎక్కువ వాపు వచ్చిన వారికి టీబీ ప్రివెన్షన్ థెరపీ ఇస్తున్నామని వారానికి ఒకసారి చొప్పున మూడు నెలల పాటు 12 రోజులు థెరపీ వాడినట్లయితే భవిష్యత్తులో క్షయవ్యాధి వచ్చే అవకాశం లేదన్నారు. ఈ రోజు పది మందికి టీబీ నివారణ చికిత్సను ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ దిలీప్‌కుమార్, పట్టణ టీబీ యూనిట్ సిబ్బంది లక్ష్మి, దిలీప్, పావని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



టీబీ నివారణ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న పట్టణ టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ రవికుమార్ తదితరులు



నిరాహార దీక్షలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

ఉద్యోగ భద్రత ఉత్తర్వులు అమలు చేయాలి

● ఎన్‌ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి) ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపోలు మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో దర్నా, నిరసన దీక్షలు మంగళవారం జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులు తక్షణమే అమలు చేయాలన్నారు. మహిళ ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పిల్లల సంరక్షణ శెలవుల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలలో జిల్లా కార్యదర్శి ఎంఎస్ రెడ్డి, డిపో కార్యదర్శి జీఎస్‌రావు, చైర్మన్ వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ రాధికకు వినతి పత్రం అందిస్తున్న పట్టణ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు తదితరులు

సివిల్ పనుల బిల్లులను సకాలంలో చెల్లించండి

● పట్టణ కాంట్రాకర్ల అసోసియేషన్ సభ్యులు

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో చేసిన సివిల్ పనుల బిల్లులను సకాలంలో చెల్లించాలని పట్టణ కాంట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు రావి భగవత్‌దత్, ఐ వీరశేఖరరావు, ఎస్.సుబ్బారావులు కోరారు. మంగళవారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబరులో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికను పట్టణ కాంట్రాక్టర్ల అసోసియేషన్ సభ్యులు కలసి తాము పూర్తిచేసిన సివిల్ పనుల బిల్లులను సకాలంలో చెల్లించే చూడాలని వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 90 బిల్లులు, డిపాజిట్లకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సుమారు 40 వరకు సీ బిల్లులు చేశారని సదరు బిల్లులు ప్రీ ఆడిట్ చేయలేదన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలలో ప్రీ ఆడిట్‌లు చేస్తున్నారని తెనాలి మునిసిపాలిటీలో మాత్రం జరగడంలేదన్నారు. తమ సమస్యలు 15 రోజులలోపు పరిష్కరించకుంటే మే 15వ తేదీ తరువాత తెనాలి మునిసిపాలిటీలో టెండర్లను బహిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రావి భగవత్‌దత్, ఐ వీరశేఖరరావు, ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలేరమ్మ తిరునాళ్ల

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణ శివారులోని వీవర్స్ కాలనీ వద్ద ఉన్న పోలేరమ్మతల్లి తిరునాళ్ల మంగళవారం భక్తి శ్రద్ధలతో జరిగింది. అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని ఉదయం ఆలయం అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకాలు పంచామృత అభిషేకాలు జరిపారు. మహిళలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించగా రైతులు తమ పంట ఉత్పత్తులను అందజేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. సాయంత్రం వీవర్స్ కాలనీ యువత ఆధ్వర్యంలో ప్రభల ఉత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొనేందుకు పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మతల్లి